నవంబర్ - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 06 |
| హవ్వ | రేచెల్ జోసఫ్ | 08 |
| మదర్ తెరీసా | | 10 |
| | బ్రదర్ కె. సామ్రాట్ | |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 13 |
| విశ్వాసం | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 14 |
| సాక్ష్యము | శ్రీ వి.జె.పట్నాయక్ | 15 |
| బైబిలు కథలు- | ఎజ్రా | 18 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - | బైబిల్ క్విజ్ | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |



ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. **250/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416



బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890



INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

'పరిశుద్ధత' మాస పత్రికను ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ప్రభువు రాకడకు గుర్తుగా ప్రపంచంలోని అనేక సంఘటనలు జరుగుతున్నాయి. దేశాల మధ్య గొడవలు ఏ క్షణాన్నైనా మరో ప్రపంచం యుద్ధం జరుగుతున్నంతగా ప్రబలుతున్నాయి. అంతేకాక, ప్రపంచమంతా కూడా క్రైస్తవులకు అనేక మంది శత్రువులు తయారవుతున్నారు. మన దేశంలో అయితే క్రైస్తవులకు గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అనేకచోట్ల క్రైస్తవులపై, పాస్టర్లపై, చర్చీలపై దాడులు జరుగుతున్నాయి. మతఛాందసవాదులు పనిగట్టుకొని మరీ క్రైస్తవ్యంపై బురదజల్లే కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నారు. క్రైస్తవ్యానికి మతరంగు పులిమి, బలవంతపు మతమార్పిడులు చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. క్రైస్తవులు శాంతికాముకులు కాబట్టి, దాడులు చేసే వారికోసం ప్రార్థన చేస్తూ, శాంతియుతంగా తమ నిరసనను తెలియజేస్తున్నారే తప్ప, ఎక్కడా ఎదురుదాడులు చేయడం లేదు. సాతానుడు గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని చూస్తూ క్రైస్తవ్యంలోకి అబద్ధ బోధకులను ప్రవేశపెట్టి క్రైస్తవ్యాన్ని భ్రష్టుపట్టించాలని పథకం పన్నాడు. ఈ మధ్యకాలంలో అబద్ధబోధకులు వెలుగులోకి రావడం వలన మతఛాందస్సవాదులు క్రైస్తవ్యంపై ఎక్కువగా దాడి చేయడానికి పూనుకున్నారు. మతఛాందస్సవాదులు సోషల్ మీడియా అయిన యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో క్రైసవ్యాన్ని టార్గెట్ చేసి బైబిలు గురించి, యేసుక్రీస్తు గురించి అబద్ధ ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీస్తును విశ్వసించే ప్రతి ఒక్కరూ ప్రార్థించాల్సిన సమయం వచ్చింది. పరిశుద్ధత పాఠకులందరూ ఈ విషయాల గురించి ప్రార్థించమని కోరుతున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచి నట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు **9440217726** నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

**20**

**(అపొస్తలుడు మూడవభాగం)**

**- కొడవటికంటి**

అరిలోని తనకు కోపం వచ్చినప్పుడల్లా తలవెంట్రుకల ను విప్పదీసి అవి కట్టిన గుడ్డను విసిరి కొడతారు. తన మాటలకు దేమేత్రి ఏమి మాట్లాడకుండా ఉదాసీనతతో ఉండటంతో తన కోపం రౌద్రంగా మారింది.

దాదాపు నలభైమంది కూర్చోని ఉన్నారు. మామూలు గానైతే ఉదయం పదిగంటలకు అందరూ ఇక్కడ కూడుకుంటారు. కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడుకొని అమ్మవారి దర్శనము చేసికొని తమ పనుల్లో మునిగి పోతారు. ఈ పండుగ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారు. ప్రతిరోజు జరిగే అమ్మకాలు వారి వారి కుటుంబాలు ఏ కొరవ లేకుండా జరిగిపోతాయి. సంవత్సరమంతా అమ్మే గుడి బొమ్మలు ఈ వారం రోజుల్లో అమ్మేస్తారు. ఆ దబ్బు వారి యొక్క అవాంత రాలకు, శుభకార్యాలకు వాడుకుంటారు. అటువంటిది పోయిన సంవత్సరం ఒక్కసారిగా బేరం పడిపోయింది. కొంత బాధపడినా ఈ సంవత్సరమైనా సంపాదించక పోతామా? అనే ధీమాతో ఉంటే ఇలా అయింది.

అమ్మవారి మహిమ ఏమి తగ్గలేదు. ఏ చక్రవర్తి అయినా, రాజైనా పదవీ స్వీకారం అయిన తర్వాత కాని, ముందు కాని అమ్మవారి దర్శనం చేసుకోవాల్సిందే. పండుగకు వచ్చే యాత్రికుల సంఖ్య కూడా తగ్గలేదు. అయితే వెండిగుళ్ళ అమ్మకం మాత్రం తగ్గింది.

"ఆ దేరాలు కుట్టే వాళ్ళ దగ్గరికి మా అబ్బాయి వెళితే అక్కడే ఉన్న సాధువు మనుష్యులు చేతితో చేసిన దేవతలు, దేవుళ్ళు కారని అరగంటసేపు చెప్పేడంట" అన్నాడు ఆంట్రకస్ నడికారున్న పూజారి.

"దీనికి ఏదో ఒక పరిష్కారం చెప్పాలి. ప్రతిసారి మనం ఇలా కూర్చుని ఏదో మాట్లాడుకొని ఎవరి సంపాదనలో వారు పడితే అసలు సంపాదనే లేకుండా పోయి అడుక్కొని తిని ఇక్కడ కూలబడి ఉండవలసిందే" అన్నాడు హీలియస్.

దేమేత్రి అందరి కళ్ళు అతని మీదనే ఉన్నాయి. అతను లేచి నిల్చున్నాడు. ఆరడుగుల మనిషి నొసలు నాలుగు అంగుళాలు వరకు తల నున్నగా చేయబడింది. వెనుక ఉన్న జడ చాలా ఒత్తుగా ఉంది. అతను లేచి నిలుచుండగానే అందరి నాలుకలు అంగిటికి అతుక్కొని పోయాయి. "అసలు ఈ దేవతను మనుష్యులు చేశారని ఎవరన్నారు. ప్రపంచంలో ఏ మానవులు కూడా చెయ్యలేని స్వరూపం కలిగిన అమ్మవారు నూట ఇరవైయేడు వరుసలు కలిగి నాలుగు వందల ఇరవైఐదు అడుగుల ఎత్తు చాలా అడుగుల వెడల్పు కలిగి తల భాగము రెండు అంతస్తుల ఎత్తైన గోపురాకారం కలిగిన విగ్రహాన్ని మానవులు తయారు చేస్తారా?" అన్నాడు పీలోయినే.

"ఎఫెసీయుల అర్తిమాదేవి మహాదేవి" అన్నాడు దేమేత్రి. కంచు మోగినట్లు ఖంగుమన్నది ఆ కంఠం. ఆదాటున వింటే ఆ స్వరం చిన్న పిల్లలు, భయపడతారు. చుట్టు కూర్చున్న కంసాలులందరూ ఎఫెసీయుల "అర్తిమాదేవి మహాదేవి" అని ఒక్క పెట్టున అరిచారు.

దేమేత్రి కూడా కుడిచెయ్యి పైకెత్తి నిల్చున్నాడు. అందరూ నిశ్శబ్దంగా అయ్యారు. "అయ్యలారా!" అని ఆగాడు. అందరూ ఆయన నోటివైపు చూస్తున్నారు. "ఈ పని వలన మన జీవనము బాగుగా జరుగుచున్నదని మీకు తెలియును" అని చుట్టూ చూశాడు. అందరూ జాగ్రత్తగా వింటున్నారు. ఇంకా కొందరు తన స్వరమువిని దగ్గరగా వస్తున్నారు.

"అయితే చేతులతో చేయబడినవి దేవతలు కావని ఈ పౌలు చెప్పాడు. ఎఫెసులో మాత్రమే కాదు. దాదాపు

ఆసియా అంతటను బహుజనమును ఒప్పించి, త్రిప్పి యున్న సంగతి మీరు చూచియు వినియు యున్నారు అతను యూదుడు".

అప్పటికే దాదాపు రెండు వందల మందిదాక గుమి గూడారు. ఇంకా జనం గుమికూడాలని దేమేత్రి ఉద్దేశ్యం. తన ప్రక్కనే ఉన్న ఎత్తైన అరుగు మీదకు వెళ్ళి నిల్చు న్నాడు. ఇప్పుడు రహదారిన వెళ్ళేవారికి కూడా తన స్వరము వినబడుతుంది. మరలా కుడిచెయ్యి పైకెత్తాడు. అందరూ నిశ్శబ్దమయ్యారు. "మరియు ఈ మన వృత్తియందు లక్ష్యము తప్పిపోవుటయే కాక మహాదేవి యైన అర్తిమాదేవి యొక్క గుడి కూడా తృణీకరింబడి ఆసియాయందంతటను, భూలోకమందును పూజింపబ డుచున్న ఈమె యొక్క గొప్పతనము తొలగిపోవునని భయము తోచుచున్నది" అని రెండు చేతులు పైకెత్తి "ఎఫెసీయుల అర్తిమదేవి, మహాదేవి" అని పెద్దగా అరిచాడు. అలా అరుస్తూనే అందరిని అరవమన్నాడు.

వెంటనే ఉరుము ఉరిమినట్లుగా దాదాపు వెయ్యి మందికి పైగానున్న గుంపు అందరూ అలానే అరుసు కుంటూ బయలుదేరారు. అందరికంటే ముందుగా దేమేత్రి నడుస్తున్నాడు. దేవాలయం వద్ద నుండి పట్టణం ఒక మైలు దూరంలో ఉంది. ఈ ఊరేగింపు పట్టణంలో ప్రవేశిస్తే పట్టణం నుండి దేవాలయం వరకు జనసమూ హం క్రిక్కిరిసి పోయారు. ఎఫెసీయుల అర్తిమాదేవి మహాదేవి అనే కేకలే కాని ఈ ఊరేగింపు ఎక్కడికెళ్తుందో ఎవరికీ తెలియదు. ఉన్నట్లుండి తియోరు కొండవైపుకు తిరిగింది. అంటే నాటకశాల వైపు వెళ్తుందన్నమాట. నాటకశాల అయితే ఎన్నివేలమందికి అయినా వసతి కల్పిస్తుంది. ముందు వెళ్తున్న కంసాలులు ఎఫెసీయుల అర్తిమాదేవి అని అరుస్తుంటే జనసమూహమంతా మహా దేవి అని అరుస్తుంది. ముందు నడుస్తున్న వారికి తప్పితే మిగిలినవారెవరికి ఈ గందరగోళమేమిటో తెలియదు.

కూరగాయల బజారుకు వచ్చేసరికి ముందు వరుస లో ఉన్న ఆంట్రికస్, గాయిని, అరిస్తర్కు ప్రక్కన అరుస్తున్న అరిలోపికి చూపించాడు. ఇద్దరూ పరుగున పోయి గాయిని, అరిస్తర్కు పట్టుకొని నాటకశాలలోనికి లాక్కుని వెళ్ళారు. దూరంగా కొండమీద ఒక బండ మీద నిలుచుని చూస్తున్నాడు లూకా. కొంచెంసేపట్లో వ్యాపార కూడలిలో ఉన్న అకుల, ప్రిస్కిల్లా దుకాణాలన్నీ మూసేస్తు న్నారు. ఎందుకు మూసివేసున్నారని అడిగాడు పౌలు అకులను.

"ఔనండీ మీరు విగ్రహాలను కొనవద్దని చెప్పుచున్నా రు కదా! అందుకని కంసాలులందరూ వ్యతిరేకత చూపు చున్నారు. అంతా నాటకశాల వైపు వెళ్తున్నారు. మా వాళ్ళను కూడా కొందరిని తీసుకొని వెళ్ళారంటా" అన్నాడు ప్రక్క దుకాణందారుడు.

పౌలు గబగబా వెళ్ళి లోపల అంగీ వేసుకుంటు న్నాడు. అకుల కూడా సిద్ధపడుతున్నాడు. ఇంటిముందు జోడు గుఱ్ఱాలబగ్గీ ఆగింది. అది చాలా ఖరీదైంది. అందు లో నుండి కెస్సినస్ దిగాడు. ఇద్దరు బానిసలు ప్రక్కన నడుస్తుంటే ఆయన గబగబ పౌలు దగ్గరకు వచ్చారు. కెస్సినస్ చూడగానే పౌలు ఆశ్చర్యపోయాడు. ఒక ఆసనం తీసికొని వేస్తూ....

"ఏమిటి ఇలా వచ్చారు" అన్నాడు. బయట జనమం తా గుంపుగా కూడి ఉన్నారు. ఎఫెసు పట్టణ మంతటిలో మర్యాదస్తుడు, మంచివాడు, ధనవంతుడు, పట్టణ పరి పాలనా సంఘాధ్యక్షుడు కెస్సినస్ ఇలా వచ్చారేమిటి అన్న ఆసక్తి.

"మీరెక్కడికి వెళ్తున్నారు?" అని పౌలును చూసి "ఇల్లు వదలి బయటకు రావద్దు. ప్రజలు గొఱ్ఱెల వంటి వారు. ఇప్పుడు వారేమి చేస్తారో వాళ్ళకే తెలియదు. నేను వెళ్ళి మీ సహోదరులను తీసుకొనివస్తాను" అని అకులకు ఏదో చెప్పి వెళ్ళిపోయాడు. ఆయన ఆ పట్టణపు కరణం.

అక్కడ సమాజ మందిరం దగ్గర పరిస్థితి మరొక విధంగా ఉంది. విగ్రహాల విషయంలో యూదులంతా పౌలుతో ఏకీభవించినను, ఈ గందరగోళానికి యూదులే

కారకులని రోమీయులు ఊహించారు. యూదులందరూ ఆలోచించి అలెగ్జాండరు నాటకశాలలో వేదిక మీదకు వెళ్ళి ఇందులో యూదుల ప్రమేయం లేదని, పౌలు బోధిస్తున్న యేసు వలననే ఇది సంభవించిందని ప్రజలకు నచ్చచెప్పాలని చూశారు. అందుకు అలగ్జాండరు ఒప్పుకుంటే యూదులు కష్టపడి అలగ్జాండరు వేదిక మీదకు వచ్చి చేతులెత్తి నిశ్శబ్దంగా ఉండమని అరవటం ప్రారంభించాడు. దేమేత్రికి అలగ్జాండర్ యూదుడని తెలుసు. అతనిని చూడగానే అక్కడున్న పూజారులు కూడా వీరావేశంతో చిందులు వేయనారంభించారు. ఎఫెసీయుల అర్తిమదేవి, మహాదేవి అనే మాట పట్టణమంతా ఒకటై అరచిన అరపు లాగా వినిపిస్తుంది.

పౌలుకు మహావేదనగా ఉంది. గాయి, అరిస్తర్కు, లూకా ఏమయ్యారు. తాను అక్కడికి వెళ్తే వారు రక్షించబడతారని అనుకున్నాడు. ఇంతలో మరి కొందరు దేశాధికారులు బగ్గీలో వచ్చారు. వారు పౌలును చూసి ఊపిరి పీల్చుకున్నారు. పౌలును ఇంట్లోకి తీసుకెళ్ళి బయటకు రావద్దని చెప్పారు. పౌలు నిరుత్సాహపడిపోయాడు. గాయి, అరిస్తర్కు క్షేమంగా ఉన్నారని తెలిసినప్పుడు అతని ప్రాణం కుదుటపడింది. లూకా ఎక్కడ అని వచ్చిన వారినడిగాడు. ఆయన కూడా క్షేమంగా ఉన్నారని వారు లోపలకు వెళ్ళిపోయారు.

దాదాపు రెండుగంటలసేపు పట్టణం అట్టుడికి పోయింది. రోమా సైనికులు ముందు నడుస్తుంటే కెస్సినస్ నాటకశాలలో ప్రవేశించాడు. ఆయన వేదిక మీదకు రాగానే చాలావరకు అరుపులు ఆగిపోయాయి. ఆయన కొంచెంసేపు నిలబడిచేతులు పైకెత్తాడు. నలుగురు రోమా సైనికులు వేదిక మీదకు వచ్చారు.

అంతా నిశ్శబ్దం. "ఎఫెసీయులారా!" అని, చుట్టూ చూసి అలగ్జాండరు వైపు చూశాడు. అలగ్జాండరు తలవంచుకొని గుంపులోకి వెళ్ళిపోయాడు.

"ఎఫెసీయుల పట్టణం అర్తిమదేవికి, ద్యుపతి యొద్ద నుండి పడిన మూర్తికిని పాలకురాలైయున్నదని తెలియని వారెవరు? ఈ సంగతులు నిరాక్షేపణమైనవి కనుక మీరు శాంతము కలిగి ఏదియు ఆతురతపడి చేయకుండుట అవశ్యము" అని గాయి, అరిస్తర్కును చూసి కొంచెం ఆగి, "మీరు ఈ మనుష్యులను తీసికొని వచ్చియున్నారు. వీరు గుడిని దోచిన వారు కారు. మన దేవతను దూషించిన వారు కారు. దేమేత్రికిని అతనితో కూడా నున్న కంసాలులకును ఎవని మీదనైనను వ్యవహారమేదైనను ఉన్న యెడల న్యాయసభలు జరుగుచున్నవి. అధిపతులు ఉన్నారు గనుక వారు ఒకరితో ఒకరు వ్యాజ్యమాడవచ్చును" అని దేమేత్రి వైపు చూచి "మీరు ఇతర సంగతులను గూర్చి ఏమైననూ విచారణ చేయవలసియుంటే అది క్రమమైన సభలు పరిష్కారమగును" అన్నాడు. తర్వాత సైనికులవైపు చూచి "మనం ఈ సంగతులను గూర్చి చెప్పదగిన కారణమేమైనను లేనందున, నేడు జరిగిన అల్లరిని గూర్చి మనలను విచారణలోనికి తెత్తురేమో అని భయమవుచున్నది. ఇలా గుంపు కూడినందున తగిన కారణము చెప్పజాలము" అన్నాడు.

ఆ సాయంకాలానికి ఉదయం జరిగిన గలిబిలి ఏమి జరుగనంతగా మాసిపోయింది. దేమేత్రి అతని అనుచరులు తమ వాదనను మరచి పోయి మామూలుగానే ఉన్నారు. అయితే అలగ్జాండరు మాత్రము పౌలును ఏ విధంగానైనా శ్రమ పెట్టవలెనని ఆలోచిస్తున్నాడు.

(సశేషం)


**మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు**

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India**<br>**Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.



రెవ.డా॥ కె.జోసఫ్

12

# శాశ్వత రక్షణ

కాబట్టి పాతనిబంధనలో యేసుక్రీస్తుకు సాదృశ్యమైన బలులు జరిగినవి. కనుకనే యేసుప్రభువు "లేఖనములే నన్ను గూర్చి సాక్ష్యము చెప్పుచున్నవని" యోహాను 5:39లో చెప్పాడు.

మచ్చ, డాగులేని పస్కా బలిపశువు యొక్క రక్తము ఇశ్రాయేలీయులను మరణము నుండి తప్పించి ఐగుప్తు దాసత్వము నుండి విడుదల పొందుటకు ఏ విధముగా ద్వార బంధముల మీద ప్రోక్షింపబడినదో అదే విధంగా పాపములేని (యోహాను 8:46, లూకా 23:14,15, 23:41,47). యేసుక్రీస్తు యొక్క పవిత్ర రక్తము లోకపాపముల నిమిత్తము సిలువ మ్రాను మీద కార్చబడినది.

ఇప్పుడు మరలా మనము ఇశ్రాయేలు విమోచన కార్యమును గమనించినట్లయితే ఇశ్రాయేలును దేవుడు విమోచించుట ద్వారా వారిని తన ప్రజలుగా సంపాదించు కున్నాడు (నిర్గమ. 15:13,16). అదే విధంగా క్రీస్తు కూడా పాపపు దాసత్వములో వున్న మనలను ఆయన రక్తము వలన విమోచించి తన సొత్తయిన ప్రజలుగా సంపాదించుకున్నాడు (ఎఫెసీ. 1:7, 1కొరింథి. 6:20).

ఐగుప్తులో ఇశ్రాయేలీయుల పాప దాస్య విమోచనార్థమై జరిగించబడిన పస్కా బలి మరలా చేయబడలేదు. ప్రతి సంవత్సరము జరిగే పస్కా బలి పండుగ మొదట జరిగించిన దాని జ్ఞాపకార్థమే కాని, ఎవరునూ విమోచింపబడుటకు కాదు. వాటి వలన ఎవరునూ విమోచించబడరు.

అదే విధంగా దేవుని గొర్రెపిల్లయైన మన యేసుక్రీస్తు తన స్వరక్తముతో మానవాళి శాశ్వత విమోచన కొరకు ఒకేసారి పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ. 9:12). మనము బల్లారాధన జరిగించునప్పుడెల్లా ఆయన మరణమును జ్ఞాపకము చేసికొనుచున్నాము (లూకా 22:19,20). అయితే సిలువ కార్యక్రమము మరలా జరుగవలసిన పని లేదు.

"ఈయన అయితే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి" అనగా పాపముల నిమిత్తమై ఎన్నటెన్నటికి నిలిచే బలిని చేశాడు. కాబట్టి ఇక మరలా బలి అవసరము లేదు. పైగా ఒక్కసారి ప్రభువు సిలువలో పలికిన జయనాదము గమనించండి.

సమాప్తమైనది!

సమాప్తమైనది ఏమిటి? ఆయన దేని నిమిత్తము ఈ లోకమునకు వచ్చెనో, ఆ పని... అదేమిటంటే మానవాళి పాపములకు ప్రాయశ్చిత్తము; పాప దాసత్వము నుండి విమోచన, నిత్యజీవప్రాప్తి అను కార్యక్రమములు పూర్తి అయినవి.

"పాపముల నిమిత్తము సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడైనాడు'

ఎప్పటికీ నీతిమంతులుగా కాలేని మనలను ఒక్క బలితోనే నీతిమంతులుగా తీర్చినాడు. అందుకే ఆ ప్రేమ నుండి మనలను ఎవరూ వేరు చేయలేరు (రోమా 8:39).

ఆ తరువాత దృశ్యమేమంటే ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము దాటుట. ఇది కూడా వారు చేయలేని కార్యమే. ఐగుప్తు దాసత్వము నుండి గొఱ్ఱెపిల్ల రక్తముచేత విమోచించ బడినను వారు దేవునితో నడువలేకపోయారు. వారు ఐగుప్తు నుండి శారీరకముగా వేరుపరచబడినవారు ఆత్మీయంగా కూడా వేరుపరచబడాలి. వారందరు మేఘము క్రిందనుండిరి, సముద్రములో నడచిపోయిరి. మేఘములోను, సముద్రము లోను, బాప్తిస్మము పొందిరి (1కొరింథి. 10:2). ఈ సముద్ర బాప్తిస్మము, మన నీటి బాప్తిస్మము క్రీస్తు మరణములోనికి

బాప్తిస్మము పొందిన దానికి నిదర్శనము (రోమా 6:3). మేఘము యొక్క నడిపింపు మనలను నడిపించే పరిశుద్ధాత్మకు గుర్తు (రోమా 8:14). ఇశ్రాయేలీయులను ఆ విధంగా మేఘము నడిపించినది (నిర్గమ.13:21). మరియు 1కొరింథి 12:13లో వ్రాయబడినట్లు మనమందరము ఒక్క ఆత్మచేతనే నడిపించబడుచున్నాము. మోషే కూడా ఈ సందర్భములో క్రీస్తునకు సాదృశ్యముగా నున్నాడు. ఎందుకంటే మోషే "నావంటి యొక ప్రవక్తను దేవుడు మీలో నుండి పుట్టించును. మీరు ఆయన మాట వినవలెనని పలికెను" (ద్వితీ.18:16, అపొ.కార్య.3:22). ఇశ్రాయేలీయులు మోషేను అరణ్యములో వెంబడించినట్లు మనము కూడా యేసుని ఈ లోకమనే అరణ్యములో వెంబడించాలి. ఇశ్రాయేలీయుల అవసరములు ఏ విధంగా దేవుడు ఆనాడు తీర్చాడో, ఈనాడు మన అవసరములు కూడా తీర్చగలనని దేవుడు వాగ్దానం చేశాడు (ఫిలిప్పీ 4:19, మత్తయి 6:32).

ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణంలోని దేవుని ఉద్దేశం ఏమైయున్నది? (ద్వితీయో.6:23) 'మనలను దానిలో ప్రవేశ పెట్టుటకు మనలను అక్కడ నుండి రప్పించెను' అని మోషే చెప్పినట్లు ఇశ్రాయేలును రక్షించుటలో వారిని అరణ్య ప్రదేశంలో విడిచి పెట్టుటకు కాక వారిని కానాను దేశమునకు చేర్చుట దేవుని ముఖ్య ఉద్దేశమైయున్నది. అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానమునుబట్టి (ఆది. 22:18) ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమిలో ప్రవేశించుట ద్వారా భూమి మీదనున్న జనాంగములన్నిటికి ఆశీర్వాద కారణంగా నుండుటయే దేవుని ఉద్దేశమై యున్నది. తమ విమోచన, రక్షణ వెనుకనున్న దేవుని ఉద్దేశములను తెలుసుకొనుటకై ఇశ్రాయేలీయులు మొదట దేవుని గూర్చి, ఆయన మార్గములను గూర్చి తెలుసుకోవాలి. వారు ఆయన ద్వారా నడిపించబడుట, ఆయన స్వరము వినుట అవసరమై యున్నది. నేను పరిశుద్ధుడను కనుక మీరును పరిశుద్ధులు కావలెను' (లేవీయ.11:45) అని చెప్పినట్లు వారు పరిశుద్ధులుగా మారాలి. 'మీ దేవుడైన యెహోవా మీకాజ్ఞాపించిన మార్గములన్నిటిలో నడుచుకోవలెను' (ద్వితీ.5:33) నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ శక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను' (ద్వితీ.6:5). 'ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రతుకుదురు'. ఆయన ఆజ్ఞలను నీవు గైకొందువో లేదో నిన్ను శోధించి, నీ హృదయంలోనున్నది తెలుసుకొనుటకు' అని (ద్వితీ.8:2) తెలియుచున్నది. ఇశ్రాయేలీయులు మొదట గొఱ్ఱెపిల్ల రక్తము ద్వారా విమోచించబడి, ఐగుప్తు నుండి విడుదల పొంది, మేఘములోను, సముద్రం ద్వారా బాప్తిస్మం పొంది అరణ్య ప్రదేశమునకు తీసుకొని రాబడినారు. ఈ కార్యక్రమములన్నియూ ముగించబడిన తర్వాత మాత్రమే, దేవుడు వారికి తన వాక్యమును బలులతో కూడిన ఆరాధన కొరకై ప్రత్యక్ష గుడారమును అనుగ్రహించాడు. వారు విమోచించబడి, రక్షించబడిన తర్వాత మాత్రమే వారు దేవుని వాక్యమునకు విధేయులై, దేవునిలో నడుచునట్లు ఆజ్ఞాపించబడినారు.

ఇది మన క్రైస్తవ అనుభవానికి సాదృశ్యంగా కనబడుట లేదా? మనము విమోచించబడకుండా, నూతన జన్మ అనుభవము లేకుండా దేవుని సేవించలేము. "మనము మన పాపముల చేతను, అపరాధముల చేతను చచ్చినవారము" (ఎఫెసి 2:1). ఎవరునూ చనిపోయిన వ్యక్తి వలన ఏ కార్యమును ఆశించరు కదా! పుట్టక మునుపే ఒక వ్యక్తి వలన ఏ కార్యమును ఆశించరు కదా! పుట్టక మునుపే ఒక వ్యక్తి తన తండ్రికి విధేయుడై యుండాలని ఎలా అడగగలం? తన భార్య గర్భములో వున్న బిడ్డ తనకు లోబడాలని చెప్పే వ్యక్తి మనకు పిచ్చివారుగా కనబడతాడు. మొదట ఆ బిడ్డ జన్మించాలి. అతనిలో జీవమున్నప్పుడే అతడు ఎదుగుటకు, తన బాధ్యతలు తెలుసుకొనుటకు, విధేయుడుగా జీవించుటకు అవకాశముంటుంది. కనుక మనము మొదట 'తిరిగి జన్మించాలి' (యోహాను 3:3) పరిశుద్ధాత్మ ద్వారా జన్మించాలి (యోహాను 3:6) క్రీస్తుతో బ్రతికించబడాలి (ఎఫెసీ.2:5) క్రీస్తు రక్తము వలన సమీపస్తులం కావాలి (ఎఫెసీ 2:13) అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల పొంది, విమోచన, పాప క్షమాపణ పొందాలి (కొలస్సీ. 1:13,14) అప్పుడు మాత్రమే మనము దేవుని స్వరము విని, దేవుని వాక్యమును అనుసరించుటకు క్రీస్తును మాదిరిగా వుంచుకొని జీవించుటకు యోగ్యులమై యుంటాము. **(సశేషం)**

స్త్రీల విభాగము

# హవ్వ



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

ఆదిలో దేవుడు తన పోలిక చొప్పున తన స్వరూపమందు నరుని సృజించాడు. (ఆది 1:27) నరుడు ఒంటరిగా ఉండడం మంచిది కాదని, వానికి సాటియైన సహాయంగా (2:18) స్త్రీని సృష్టించాడు. అతనికి గాఢనిద్ర కలుగజేసి అతని ప్రక్కటెముకలలో ఒకటి తీసి దానిని స్త్రీగా నిర్మించాడు. ఆమెకు "హవ్వ" అని పేరు పెట్టాడు.

భూమిమీద మొట్టమొదట జీవించిన పురుషుడు – ఆదాము! భూమి మీద మొదటి స్త్రీ – హవ్వ!! వీరిద్దరికి దేవుడు ముందుగానే వసతులు ఏర్పరిచాడు. పగలూ, రాత్రి, సూర్యుడు, చంద్రుడు, సముద్రాలు, నదులూ, చక్కని దృశ్యాలు, చల్లని గాలులూ, సంధ్యా సమయాలూ, ఉషోదయాలు, ఒకటేమిటి ఆనందాలూ, సంతోషాల ప్రపంచం అది! దుఃఖము, వేదన, కష్టాలు, కన్నీళ్ళు, సమస్యలు అంటే ఏంటో కూడా తెలియదు.

దేవుడు ఏదేను తోటలో వారిని ఉంచాడు. తోటనిండా పచ్చని వృక్షాలు మధురమైన ఫలాలు, కావలసినన్ని తినొచ్చు! సంధ్యా సమయంలో చల్లపూట దేవుడు వారి దగ్గరకు వచ్చి వారితో కలసి సంతోషించే సమయం ఎంత ఆనందకరమైనది! దానిని వర్ణించడం ఎవరి తరం!! ఇంతటి అందాలూ, ఆనందాలు వారిద్దరూ కలిసి పంచుకున్నారు.

"ఇది నిజమా? దేవుడు ఈ తోటలేని ఏ చెట్టు పండ్లు తినవద్దని చెప్పాడా" అన్న సాతాను ప్రశ్నకు, హవ్వ తోట చెట్ల ఫలాలన్నిటిని తినవచ్చునుగాని తోట మధ్యనున్న చెట్ల ఫలములు తింటే మాత్రం నిశ్చయంగా చచ్చిపోతారని దేవుడు చెప్పాడు అని అమాయకంగా సమాధానం చెప్పింది. అప్పుడు సర్పము – "మీరు చావనే చావరు గాని మీ కన్నులు తెరువబడి, మంచి చెడ్డలు తెలుసుకొని దేవతల్లాగా ఉంటారని దేవునికి తెలుసు. అందుకే తినొద్దని మీకు చెప్పాడు" అనగానే హవ్వకు ఆశ పుట్టింది. నిజంగానే ఆమె కన్నులకు ఆ చెట్టు చాల రమ్యంగా దాని పండ్లు చాలా ఆకర్షణీయంగా కనబడ్డాయి. అందుకే కొన్ని పళ్ళు తను తినడమే కాక తన భర్తకూ ఇచ్చింది. అతడు కూడా తినేశాడు. ఇకనేం! సమస్యలు మొదలైపోయాయి. ఆనందాల నిలయం సమస్యల వలయంగా మారింది. ఆనందాల మనస్సులలో ఆవేదనలు ప్రారంభమయ్యాయి. ప్రశాంత వాతావరణంలో పరిస్థితులు మారిపోవడానికి కారణం ''హవ్వ'' అదే, స్త్రీ! ఆనందాల నిలయం అల్లకల్లోలమయింది. నెమ్మది లేకుండాపోయింది.

హవ్వ దేవుని ఆజ్ఞను అతిక్రమించడానికి కారణం ఆమె నేత్రాశ. దేవుడు తినవద్దు అని చెప్పినప్పటికి ఆమెకు వాటిని తినాలి, రుచి చూడాలి అని కోరిక కలిగి ఉండవచ్చు అందుకే సాతాను ద్వారా చాలా సునాయాసంగా మోసపరచబడింది. అంతేకాక ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు సాతాను ఆమెతో మాట్లాడాడు. ఆమె దేని నిమిత్తమైతే నిర్మించబడిందో అది మర్చిపోయింది. ఆదాముకు సాటియైన సహాయంగా దేవుడు ఆమెను చేసాడు. కానీ హవ్వ ఆదాముకు సహాయకారిగా ఉండక తను స్వంత ఆలోచనలకు ఊతమిచ్చింది.

సాటియైన అంటే అన్ని విషయాలలో సరితూగగల/ సరిపోయిన అని అర్థం వస్తుంది. సహాయం అంటే మనం

చేయాలి అనుకున్న పనిని మనకంటే ముందుగా చేసి పని భారాన్ని తగ్గించడం లేదా బాధ్యతని పంచుకోవడం అనే అర్థం వస్తుంది. హవ్వ అన్ని విషయాలలో ఆదాముతో సాటియైనది. అయితే హవ్వ ఆదాముకు సహాయకారిగా లేదు.

ఆమె తన నిర్మాణానికి వెనుక ఉన్న దేవుని ఉద్దేశాన్ని గుర్తించక చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను ఆశ్వాదిస్తూ ఉంది. బహుశా అదే ఆమెను మంచి చెడ్డల తెలివినిచ్చు పండ్లను ఆశించేలా చేసింది. ఆమెకు ఆ పండ్లు తినాలి అనే కోరిక కలిగింది. అయితే దేవుని ఆజ్ఞను బట్టి ఆ పండు తినడానికి సాహసించలేదు. ఆ పండు తినవద్దు అని చెప్పిన దేవుని మాట కంటే తినడం వలన వచ్చే నష్టానికే ఆమె విలువ ఇచ్చి ఉండవచ్చు. తింటే చనిపోతారు అనే భయంతోనే ఆ పండును తినాలి అనే కోరికను అణుచుకొని ఉండవచ్చు. అందుకే ఎప్పుడైతే సాతాను ఆ పండు తింటే మీరు చావనే చావరు అని చెప్పిందో హవ్వకు ఆ పండు తినడానికి కావాల్సిన ధైర్యం వచ్చింది. అంతే కాదు పండు తినడం వలన వచ్చే లాభాలు (దేవతల్లా ఉంటారు, మంచిచెడ్డలు తెలుసుకుంటారు) తెలుసుకోగానే ఆ పండు పట్ల మరింతగా ఆకర్షితురాలైంది. ఆ క్షణంలో దేవుని ఆజ్ఞ, దాని పర్యవసానం ఏమి గుర్తుకు రాలేదు. విచక్షణ కోల్పోయింది. ఇప్పుడు మంచి చెడ్డల తెలివినిచ్చే చెట్టు పండు కనులకు అందమైనది, వివేకమిచ్చేదిగా, రమ్యమైనదిగా కనబడింది. వెంటనే దేవుని ఆజ్ఞను అతిక్రమించి పాపాన్ని చేసింది. పాపం చేశాను అనే భావన కూడా లేక ఆ పండ్లను ఆదాముకు ఇచ్చి పాపాన్ని కొనసాగించింది. ఆదామును కూడా దేవుని ఆజ్ఞ మీరడానికి కారణమైంది. తత్ఫలితంగా దేవుని కోపానికి కారణమై, శాపాన్ని అనుభవించింది.

మనం కూడ హవ్వవలె అతి త్వరగా నేత్రాశకు లోనౌతుంటాం. ఈలోకంలో చాలా విషయాలు (ధనసంపదలు, స్థితిగతులు, పేరుప్రఖ్యాతులు, లోక సమాచారాలు, సుఖబోగాలు) మనల్ని ఆకర్షిస్తుంటాయి. చాలాసార్లు మనం ఆశించేది దేవునికి వ్యతిరేకమైనది అని తెలిసి కూడ ఆశిస్తాము. దాని గురించే ఆలోచిస్తాము ఎప్పుడైతే మనం విచక్షణ కోల్పోతామో మనం ఆశించినది మనకు చెడ్డగా కాక మంచిగా కనబడుతుంది. అంతేకాదు అదే కరెక్టు అని కూడ అనిపిస్తుంది. ఆ సమయంలో కనీసం అపరాధ భావము కూడ ఉండదు కాబట్టి చాలా ధైర్యంగా ఆశించిన దానిని కార్యాచరణలో పెడతాము. ఆనందిస్తాము. దేవుని మరచిపోతాము. హవ్వ ఎలా అయితే దేవుని కోపానికి గురి కావాల్సి వచ్చిందో మనం కూడ దేవుని కోపాన్ని భరించవలసి ఉంటుంది. "**దేవుని మరచువారలారా, దీని యోచించుకొనుడి. లేనియెడల నేను మిమ్మును చీల్చి వేయుదును తప్పించు వాడెవడును లేకపోవును**" అని (కీర్తనలు 50:22) సెలవిస్తుంది.

హవ్వ ఉన్న పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు మనకు దేవుని గూర్చిన జ్ఞానం తెలుసుకునే అవకాశాలు ఎక్కువ కాబట్టి తెలిసి చేసే పాపాలకి పడే శిక్ష కూడా అంతే తీవ్రంగా ఉంటుంది. హవ్వ దేవుని మాటను ఎలా నమ్మిందో సాతాను మాటను కూడా అలానే విని నమ్మింది. కొంచెం కూడ ఆలోచించలేదు. తాను విన్నవాటి గురించి ఎవరితోను మాట్లడలేదు. వెంటనే స్వంతంగా ఒక నిర్ణయం తీసుకుంది. తత్ఫలితంగా లోకం మీదకి పాపాన్ని శాపాన్ని తెచ్చిపెట్టింది. మనం కూడా హవ్వవలె అనేకసార్లు స్వంత నిర్ణయాలతో దేవుని వద్ద విచారించక ఆయన చిత్తానికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకొని ఈ లోకానుసారమైన జ్ఞానంతో ఆ నిర్ణయాన్ని సమర్ధించుకుంటూ దేవునికి వ్యతిరేకమైన జీవితాన్ని జీవిస్తుంటాం. కనీసం మనం చేస్తున్న పని మనం తీసుకున్న నిర్ణయాన్ని దేవుని వాక్యంతో పోల్చి సరియైనదా కాదా అని ఆలోచించము. కనీసం ఇప్పటి నుండైనా మన ఆలోచనలు, పనులు, నిర్ణయాలను దేవుని వాక్యంతో సరిచూసుకుంటూ, సరిచేసుకుంటూ జీవిద్దాం. తద్వారా సాతాను కుయుక్తిని జయించి పాపంలో పడకుండా దేవుని శాపానికి గురి కాకుండా దేవునికి ఆమోద యోగ్యమైన జీవితాన్ని జీవించి దేవుని దీవెనలు పొందుకుందాం.

15



బ్రదర్ కె.సామ్రాట్

# మదర్‌తెరీసా

సూపర్ సాకర్ హీరో అయిన డీగో మారడోనా కలకత్తా పర్యటన వెనుక ఆయన కోరిక వెలిబుచ్చారు. మదర్ తెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌ను సందర్శించాలనే డీగో మారడోనా స్వప్నం సాకారమయ్యిందంట. డిసెంబరు 2008, రెండవవారం డిగో మారడోనా మదర్ హౌస్‌లో అడుగుపెట్ట గానే పక్షవాతంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ళ చిన్నారి మేఘాను ఆత్మీయంగా దగ్గరు తీసుకుని ముద్దాడాడు. ప్రతిఫలంగా మేఘ భారత క్రికెటర్లు ధరించే నీలంరంగు టోపీని మారడోనాకు బహుకరించింది. అనంతరం తన కోసం వేచి చూస్తున్న నలభైమంది చిన్నారులను కూడా మారడోనా ఆప్యాయంగా ముద్దాడాడు. మదర్ హౌస్‌ను సందర్శించడం ద్వారా కోల్‌కతాలో తన పర్యటన లక్ష్యం నెరవేరిందని ప్రస్తుతం అర్జెంటీనా జాతీయ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఈ సాకర్ మాంత్రికుడు పేర్కొన్నారు. ఫ్రెంచ్ భాష తెలిసిన నన్ ఒకరు మదర్ తెరీసా బోధలను, ఆమె చేసిన సేవలను మారడోనాకు వివరించారు. అనంతరరం మదర్ సమాధిని సందర్శించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ విధంగా ప్రపంచంలో ఎందరికో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థ సందర్శన ప్రియమైన స్థలంగా మారింది.

మదర్ తెరీసా శిశుభవన్ పిల్లల్ని దత్తతకివ్వడం ద్వారా వారు కుటుంబ పోషణలో జీవించే అవకాశం ఉంటుందని ప్రోత్సాహించేవారం. భారతదేశంలోనేకాక ఇతర దేశల వారు కూడా శిశుభవన్ పిల్లల్ని దత్తత తీసుకోడానికి వచ్చేవారు. విదేశాలకు పిల్లలను దత్తత ఇచ్చే విషయం విమర్శలకు గురవుతూనే ఉంది. పిల్లల్ని అమ్ముకోవడమనేది ప్రపంచ వ్యాప్తంగా "పిల్లల వ్యాపారం" అని వార్తలు వెలువడుతూనే ఉంటాయి. కొన్నిసార్లు ఆ వార్తల్లో అతిశయోక్తులు లేవని తేలుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అందమైన పిల్లల్ని కొనుక్కోడానికి ఎంతైనా చెల్లిస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లల్ని అపహరించుకుపోయే సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దానివల్ల విదేశీ దత్తతలు మందగించడం జరుగుతుంది లేదా దత్తత విధానాన్ని పునఃపరిశీలించ డమూ అవసరమవుతుంది. పత్రికా వార్తల వల్ల మదర్ తెరీసా దత్తత ఇవ్వడం ఆపుచేసిన సందర్భాలు ఉన్నాయి. ఆర్థికంగా వెనుకబడిన తృతీయ ప్రపంచం నుండి పిల్లల్ని యూరపు దేశములో దత్తతకోసం పంపించి ఆ పిల్లల్ని వైద్య పరిశోధన లకు వాడుకుంటున్నారని ఒక పత్రికలో సంచలనాత్మక కథనం ప్రకటించబడింది. ఆ పత్రిక ప్రకటన చూసి మదర్ తెరీసా మనఃస్థాపానికి గురై వెంటనే ఢిల్లీ వెళ్ళి ఆ దేశ అంబాసిడర్‌ను కలిసి తన ఆందోళనను వివరించింది. ఆ కథనం దారుణమనీ అప్రతిష్ఠాకరమనీ ఆ పత్రిక సంపాదకుని లేఖ వ్రాశారు. ఆ పత్రిక క్షమాపణ చెప్పింది.

దేవుని దయవలన మరియు ఆమె చిత్తశుద్ధి మనం ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఎక్కడో దిక్కులేని చావుకు గురి కావలసినవారో లేక అనాధలుగా బ్రతకవలసిన బిడ్డలు తమ జీవితాలలో మేలైన బ్రతుకులు జీవించడానికి మదర్ తెరీసా ద్వారా ప్రణాళిక చేయబడినట్లు చూడగలము. స్విట్జర్లాండులో జోమిల్లర్‌గారు 'దీపావళి దత్తత సేవా సంఘం' స్థాపించారు. ఈ సంస్థవారు బిడ్డలను దత్తతకు తీసుకునే కుటుంబాలను క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను మదర్ తెరీసా సిస్టర్స్‌కు సమర్పించేవారు. మదర్ తెరీసా సిస్టర్స్ దత్తతకు ఇవ్వబడే బిడ్డల యొక్క వివరాలను, వారికున్న

శారీరక, మానసిక లోపాలు ఏమైనా ఉంటే వాటిని, వారిని ఏలాటి వాతావరణంలో పెంచితే బాగుంటుంది అనే అంశాలను వారికి తెలియజేసేవారు. ఈ విధంగా దత్తతకు సంబంధించి ఆ కుటుంబ పరిస్థితులు, దత్తకు వెళ్ళబోయే బిడ్డ విషయాలు సరి చూసుకుని సరియైన అవగాహనతో నిర్ణయం తీసుకునే వారు. దత్తతకు వెళ్ళబోయే బిడ్డ అంగీకారాన్ని తీసుకొని ఆ ఫోటోను ఆ కుటుంబానికి చూపేవారు. అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని దత్తత చేసుకున్న బిడ్డతో వారి దేశానికి వెళ్ళేవారు. ఇలా దత్తత కివ్వబడిన బిడ్డలు కొంత కాలానికి పెరిగి పెద్దవారై ప్రయోజకులైన తరువాత మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్‌లో వాలంటీర్లుగా పనిచేసి వెళ్తూ వుంటారు. ఎంత గొప్ప ప్రణాళిక గదా! ఫ్రాన్సు దేశములో ఒక కుటుంబం దత్తత తీసుకున్న అమ్మాయి చెత్తకుండీలో అరచేతిలో సరిపోయేంత చిన్న ఆకారముతో నెలలు తక్కువగా జన్మించిన బిడ్డగా మదర్ తెరీసా సిస్టర్స్‌కు దొరికింది. ఈ బిడ్డ ఫ్రాన్సు దేశములో పెరిగి పెద్దదై ఒక నర్సుగా శిక్షణ పొంది ఆమె శెలవులలో శిశుభవన్ వాలంటీర్‌గా చేసి తిరిగి తన దత్తత తలిదండ్రుల వద్దకు వెళ్ళేది. ఇదే బిడ్డ అబార్షన్‌కు గురై పుట్టకుండా ఉండి ఉంటే లేక మదర్ తెరీసా సిస్టర్స్ ఈమెను చెత్తకుండీ నుండి కాపాడుకుంటే, కాపాడి మంచి సంపన్న కుటుంబములో దత్తతకు పంపబడి తిరిగి తనలాగా అభాగ్యులుగా జన్మించిన వారికి సేవ చేసే అవకాశం వచ్చిందంటే ఆ బిడ్డ యెడల దేవుని ప్రణాళిక ఎంత గొప్పది గదా. అందుకే మదర్ తెరీసా ఏ బిడ్డను ఎవరు చంపకూడదని. ముఖ్యంగా అబార్షన్ చేయించి బిడ్డలను చంపడం ఎవరికీ హక్కులేదని, అంతకంటే మహాపాపం మరొకటి లేదని మదర్ బోధించేవారు.

ఫ్రెంచివారు, స్విస్‌వారు, బెల్జియంవారు, కెనడావారు ఉదారమైన వారు. వీరు తీవ్రమైన ఎముకల సమస్యలతో బాధపడే పిల్లల్ని లేదా పోలియోతో బాధపడేవారిని, మానసిక వ్యాధులున్న వాళ్ళని తీసుకుని పెంచడానికి ఇష్టపడతారు. కొన్ని కుటుంబాల వారికి కన్న సంతానమున్నాగాని పై లోపాలు ఉన్న పిల్లల్ని దత్తత చేసుకుని వారి బిడ్డలతో సమానంగా పెంచడానికి ఇష్టపడతారు. 'నా కడుపున పుట్టిన బిడ్డ నాది అనుకోవడం అహంకారం' అని వారి అభిప్రాయం. అనాధలైన వికలాంగులకు తమ ప్రేమను పంచడం వారి అదృష్టంగా భావిస్తారు. లుసానెలోని ఒక స్విస్ కుటుంబం ఒక బిడ్డను దత్తత తీసుకుందామని అనుకున్నప్పుడు, వారికి ఇద్దరు బిడ్డలను దేవుడు అనుగ్రహించారు. అయినా జబ్బుతో ఉన్న అనాధ బిడ్డను కూడా దత్తత తీసుకుని పెంచాలని నిర్ణయించు కుని, మదర్ తెరీసా దగ్గర జోమిల్లర్ ద్వారా మూడు వారాలకోసారి రక్తమార్పిడి చేయిస్తే తప్ప ఆర్నెల్లకు మించి బతకని ఒక పిల్లవాడిని తెచ్చుకున్నారు. ఈ పిల్లవాడి కోసం ఈ కుటుంబం త్యాగాలు చేయవలసి వచ్చింది. వైద్యం చేయించ డానికి వారి జీతం సరిపోక కారు కూడా అమ్మి వేయాల్సి వచ్చింది. చూసిన వారంతా వారికి పిచ్చి పట్టిందనే వారట. కాని ఆ పిల్లవాని మీద మమకారం వారికి ఏ మాత్రం తగ్గలేదు. పరలోకంలో వారి నిధి అధికమౌతుందనే వారట.

మదర్ తెరీసా ఎంతగానో అభిమానించే పిల్లవాడు ప్రిన్స్. బల్లెస్ట్రాజ్ కుటుంబము స్విట్జర్లాండ్‌లోని సియరె అనే పర్వత ప్రాంత పట్టణంలో ఉంటున్నారు. బల్లెస్ట్రాజ్ అవిటి పిల్లలకు ఉపయోగించే పనిముట్లు, వస్తువులు చేయుటలో నిపుణుడు. ప్రిన్స్‌కు ఏడాదిన్నర వయసున్నప్పుడు బల్లెస్ట్రాజ్ కుటుంబము అతనిని దత్తత తీసుకున్నారు. ప్రిన్స్‌కు మొండెం క్రింద భాగం, రెండు కాళ్ళు లేవు. చేతులు ముందుకు మామూలుగా ఉండాల్సింది వెనక్కి తిరిగి ఉంటాయి. ఈ బిడ్డ అందరివలె బ్రతకాలని ఈ దత్తత చేసుకున్న దంపతులు ఆకాంక్షించారు. ఆ పిల్లవాడి వర్చస్సు, ప్రశాంతత, కలుపుగోలుతనము కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. కొందరు నిపుణులు అతని మొండెం భాగాన్ని రబ్బరు పాత్రలో అమర్చిపెట్టారు. దాన్ని కృత్రిమమైన రెండు పాదాలకు బిగించారు. బ్యాటరీతో నడిచే చక్రాల బండిలో బడికి పంపేవారు. ప్రిన్స్ ఆ కుటుంబంలో ఆరో వాడు. ఆ దంపతుల కడుపున పుట్టిన వాళ్ళు ముగ్గురు. సబిత అనే రెండేళ్ళ మానసిక సమస్యలున్న అమ్మాయిని, మాయ అనే ఆరేళ్ళ పిల్లను దత్తత తీసుకున్నారు. గుర్జాన్ అనే కళ్ళు కనిపించని

పిల్లవాడిని, సప్న అనే మానసిక రోగిని కూడా దత్తత చేసుకున్నారు. పదిమంది పిల్లలతో బల్లెస్ట్రాజ్ ఇల్లు నిండింది. ప్రేమకుమారి అనే అమ్మాయికి చేతులు, కాళ్ళు లేవు. బల్లెస్ట్రాజ్ దంపతులు ప్రేమకుమారిని కూడా తెచ్చు కోవాలని అనుకున్నారు. అప్పటికే ఆ పిల్లకి పదేళ్ళు. మామూలుగా దత్తత తీసుకొనే వయసుకంటే చాలా ఎక్కువ. బల్లెస్ట్రాజ్ భార్య ఆ పిల్లను గురించి విన్నాక తమ ఇల్లే ఆ ప్రేమకుమారి ఇల్లు కావాలని అనుకున్నారట. ఈ విధంగా బల్లెస్ట్రాజ్ ఇల్లు పదకొండుమంది పిల్లలతో సంతోషానందములతో విలసిల్లే గృహంగా మారింది.

సియెరెకి దగ్గర్లో ఉంటున్న మచెడ్ దంపతులు రాణి అనే అమ్మాయిని దత్తతకు తీసుకున్నారు. రాణినేగాక మరో ఆరుగురు పిల్లల్ని పెంచుకున్నారు. మొదట్లో ఇద్దరు అబ్బాయి లను పెంచుకున్నారు. కంపూచియా యుద్ధంవల్ల అనాథలయిన వారు. తర్వాత రాజ్, సూరజ్ అనే అన్నదమ్ములను దత్తతకు తెచ్చుకున్నారు. వీళ్ళిద్దరు డార్జిలింగ్ పిల్లలు, ఇంట్లో నలుగురు మగపిల్లలున్నారు, ఆడపిల్లలు కూడా ఉంటే బాగుంటుందని ముగ్గుర్ని దత్తత తీసుకున్నారు. ఆరేళ్ళ గీత, మూడేళ్ళ బిందు, నాలుగేళ్ళ రాణి. బిందుకు చెముడు, మూగ. వీళ్ళంతా ఆదరించే కుటుంబంలో హాయిగా జీవిస్తున్నారు. రాణి కిలకిల నవ్వుతూనే ఉండేది. ఆ పిల్ల వల్ల మచెడ్ కుటుంబం మరింత సంపన్నం అయినట్లు కనిపించేదట.

ఎవరికీ అక్కర్లేని పిల్లల్ని మదర్ తెరీసా పెంచి పెద్ద చేసేవారు. దత్తత వయసు దాటని అబ్బాయిలను మిషనరీస్ బ్రదర్ ఆఫ్ చారిటీ గృహాలకు పంపేవారు. అక్కడ వారికి చదువు చెప్పించి, ఏదో వృత్తి పని నేర్పించేవారు. ఉద్యోగం దొరికేందుకు సాయం చేస్తారు. మామూలుగా ఈ పిల్లల చదువు, బాధ్యత మోసే వాళ్ళను చూసేవారు. అలా బాధ్యత మోసే వాళ్ళే వేలాదిమందికి చదువు చెప్పిస్తుండేవారు. పిల్లలు చదువునందు రాణిస్తే యూనివర్సిటీ చదువుల వరకు చదువుతుండేవారు. చదువు సంధ్య అబ్బని అమ్మాయిలకు పెళ్ళిళ్లు చేసి పంపేవారు. మదర్ తెరీసా ప్రతి వాళ్ళకి ఏదో కొంత కట్నం ఇచ్చేటంత వాస్తవికంగా ఉండేవారు. కొన్ని చీరలు, వంటపాత్రలు, కుర్చీలు, బల్లలు. కొద్దిగా డబ్బు బ్యాంక్ డిపాజిట్‌లో వాళ్ళ పేరు మీద వేసి ఉంచేవారు. వాటిని పాటించకుండా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం కష్టం. మదర్ ఆలోచనలు, పనులు ఆచరణాత్మకంగా ఉంటాయి. శిశు భవన్‌లో పెరిగిన అమ్మాయిలు చక్కగా కాపురాలు చేసుకుం టున్నారు. వాళ్ళ వాళ్ళ కుటుంబాలు వాళ్ళకు ఉన్నాయి. కలకత్తాలోనే ఉంటున్నవాళ్ళు ఎక్కువగా మదర్ హౌస్‌కు వస్తూనే ఉంటారు. ముఖ్యంగా పండగలప్పుడు మదర్ తెరీసా కూడా హాజరై ఆ కుటుంబాలను ఆశీర్వదిస్తుంటారు.

**(సశేషం)**

## పాఠకుల పేజీ

'పరిశుద్ధత' పత్రికలో **'పాఠకుల పేజీ'** అనే శీర్షిక ప్రారంభించుచున్నాము. ఈ పేజీ పూర్తిగా పాఠకులకు కేటాయించబడినది. ఈ పేజీలో మీ కుటుంబ సభ్యుల యొక్క పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలకు సంబం ధించి వారికి పత్రికా ముఖంగా శుభాకాంక్షలు తెలియ జేయవచ్చును. మీ కుటుంబంలోని యువతీ యువకుల వివాహ సంబంధ సమాచారం అలాగే సువార్త సభల సమాచారం, పదవీ విరమణ సమాచారం, జ్ఞాపకార్థ కూడికల సమాచారం కూడా పంపవచ్చు. పత్రిక గురించి మీరు వ్రాసే ఉత్తరాలు కూడా ఈ శీర్షికలో ప్రచురించబడతాయి. అయితే ఈ అవకాశం ఉపయో గించదలుచుకునే వారు చందాదారులై ఉండాలి. పత్రికకు కట్టిన చందా మొత్తాన్నిబట్టి వారికి స్థలం కేటాయించబడు తుంది. సంవత్సర చందాదారులకి పేజీలో 1/4, రూ. 500 కట్టిన వారికి 1/2 పేజీ, రూ. 1000 కట్టిన వారికి ఫుల్ పేజీ కేటాయించబడును. రూ. 2000 కట్టిన వారికి టైటిల్ (కలర్) లోపలి పేజీలో 1/2 పేజి. రూ.5000 కట్టిన వారికి టైటిల్ లోపలి ఫుల్ పేజీ కేటాయించ బడును. ఈ అవకాశం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే ఉచితంగా ఇవ్వబడు తుంది. ప్రతినెలా 5వ తేదీ తర్వాత తేదీలలోని సంధర్భాలను మాత్రమే పంపించాలి. ఫోటో ప్రచురించాలంటే మీ ఫోటోని **Whatsapp** ద్వారా 9440217726కి లేదా ఈ-మెయిల్ ద్వారా holiness.ierf@gmail.comకి పంపాలి.

# దేవుడు - సిరి



మనిషి జీవించటానికి మూలము నీరు. ఈ నీరు ఎక్కడ దొరుకుతుందో అక్కడ మనిషి తన ఉనికిని ఏర్పాటు చేసుకొన్నాడు. నీరు లేని చోటు స్మశానమే అవుతుంది.

అబ్రామును దేవుడు ఊరు అనే ప్రదేశము నుండి "నేను నీకు చూపించే ఊరికి బయలుదేరమన్నాడు". నీరు సమృద్ధిగా లభించే స్థలము "ఊరు". అబ్రాము ఆస్థి అంతా పశువులే! వాటికి జీవం నీరు. నీరు దొరకని ప్రాంతం – అంటే నదులు, కాలువలులేని ప్రాంతము కనానుకు తీసుకొనివచ్చాడు.

ఇశ్రాయేలీయులతో మోషే – మీరు స్వాధీనపరచుకొనబోవు దేశము ఐగుప్తు దేశము వంటిదికాదు. అక్కడ విత్తనములు విత్తి, కూరతోటకు నీరు కట్టినట్లు నీ కాళ్ళతో చేలకు నీరు కట్టాలి. అయితే మీరు స్వాధీనపరచుకొనబోవు దేశము కొండలు గల దేశము. అది ఆకాశ వర్షమును త్రాగును. అది నీ దేవుడైన యెహోవా లక్ష్యపెట్టు దేశము. నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు దానిమీద ఉండును.

దేవుడు ఇశ్రాయేలీయులకిచ్చిన దేశములో కొండలు, లోయలు, ఉన్నవేకాని – జలపాతాలుకాని, చెరువులే కానీ, నదులేకానీ లేవు. దానినే ఆయన పాలు తేనెలు ప్రవహించు దేశము అంటున్నాడు. పాలు తేనెలు ప్రవహించుటకు పశువులు, అడవులు లేవు. ఇశ్రాయేలీయుల సంఖ్యలో లక్షమంది – ఓ నది ప్రక్కన నడిస్తేనే కాని వారి దాహము తీరదు. అయితే అరణ్యములో ఆయన బండను చీల్చి సముద్రమంత సమృద్ధిగా వారికి నీరు త్రాగించెను.

అంటే ఓ మనిషికాని, ఓ ఊరుకాని ఓ దేశము కాని ఈ లోకములో పాలు తేనెలు త్రాగి జీవించటానికి ఆ మనిషికి అందుబాటులో ఉన్న వనరులు మూలము కాదని, "యెహోవా సెలవిచ్చిన ప్రతి మాటవలన మనుష్యులు బ్రతుకుదుర"ని మనం గ్రహించాలి.

ఈనాడు మానవజాతి మనుగడ కొరకు ఏర్పరచుకొనిన కట్టడాలు, కట్టుబాట్లు దేవుని నోటి మాటవలన జీవించేవిగా ఉండకపోతే అవన్నీ అనర్థాలే!

రేపటి కొరకు దాచుకో, బిడ్డలకొరకు ఆస్థులు సంపాదించి, వృద్ధాప్యం కొరకు కూడబెట్టు అనే నినాదాలన్నీ అనర్థాలకే గదా! ఈలోకంలో మనం నిశ్చింతగా, దీవెన కరముగా బ్రతకటానికి దేవుడు కొన్ని సూత్రాలు ఏర్పరచాడు. మొదటిది – నీ సొంతము అనుకొనిన ప్రతిదానిలో దేవుని భాగము తీసి ఇవ్వు.

"నీ ఆహారము ఆకలిగొనిన వానికి పెట్టుటయు, నీ రక్త సంబంధికి నీ ముఖము త్రిప్పకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు, వస్త్రహీనుడు నీ కంటబడి నపుడు వానికి వస్త్రము నిచ్చుట యు ఇదియే గదా నా కిష్టమైన ఉపవాసము" అంటున్నాడు.

"ఆలాగున నీవు చేసినయెడల నీ వెలుగు వేకువచుక్కవలె ఉదయించును. స్వస్థత నీకు శీఘ్రముగా లభించును. నీ నీతి నీ ముందర నడచును. యెహోవా మహిమ నీ సైన్యపు (కుటుంబము) వెనుకటి భాగమునకు కావలి యుండును".

"అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తరమిచ్చును. నీవు మొఱ్ఱపెట్టగా ఆయన నేనున్నాననును". ఇంతకంటే దేవుడు మానవులకు ఏమి వాగ్దానము చేయగలడు?

ఏ రోగము లేకుండా చేసి కుటుంబమునకు ఆయన కావలి కాచినప్పుడు ఎవరైనా బీదలుగా ఈ లోకములో జీవిస్తారా?

దేవుని నమ్ముకోవడం అంటే ఏమిటి? ఈ మాటలను నమ్మనివారు దేవుని నమ్మినట్లేనా? మన జీవనమంతయు దేవునిలో భద్రపరచబడినది అని నమ్మేవారే దేవుని నమ్మినవారు.

# విశ్వాసం

ప్రతి క్రైస్తవున్ని చాలా సర్వ సాధారణంగా **'విశ్వాసి'** అని చెప్తుంటారు. కాని అసలు విశ్వాసం అంటే ఏమిటి అంటే చెప్పగలిగే వాళ్ళు, చెప్పిన దాని ప్రకారం జీవించే వాళ్ళే నిజ క్రైస్తవ విశ్వాసులు. విశ్వాసం అంటే ఏమిటో ఒక యథార్థ సంఘటన ద్వారా తెలుసుకుందాం!

ఒక యవ్వనస్థుడు రెండు కొండల మధ్య ఒక తాడు కట్టి ఆ తాడుపై నడిచి, ఆ కొండల మధ్యన ఉన్న లోయను దాటుతాను అని ప్రకటించాడు. ఏ మాత్రం కాలు జారిన శవం కూడా దొరికే అవకాశం లేనటువంటి లోతైన లోయ. అయితే ఆ యవ్వనస్థుడు చాలా ధైర్యంగా తాడుపై నడవడం ప్రారంభించాడు. అందరూ ఉత్కంఠంగా చూస్తున్నారు. ఆ కుర్రాడు చాలా సునాయాసంగా త్రాడుపై నడిచి లోయను దాటాడు. అందరి ముఖాలలో సంతోషం, ఆ సన్నివేశం చూసిన వారందరూ ఆనందంతో కేకలు వేశారు. ఇంతలో ఆ యవ్వనస్థుడు, ఆనందంతో కేరింతలు వేస్తున్న వారిని రెండు ప్రశ్నలు అడిగాడు. మొదటిది "నేను ఈ తాడుపై నడుస్తూ మరల ఈ వైపునుండి ఆ వైపుకు క్షేమంగా వెళ్ళగలనని మీరు నమ్ముతున్నారా?" అని అడిగాడు. అక్కడి జనులు "నమ్ముతున్నాం" అని గట్టిగా కేకలు వేశారు. అప్పుడా యవ్వనస్థుడు రెండో ప్రశ్న వేశాడు. "నన్ను నమ్మితే ఎవరైనా ఒకరు రండి నేను వారిని క్షేమంగా లోయ ఈ వైపు నుండి ఆ వైపుకు తీసుకెళ్తాను" అన్నాడు. అంతా నిశబ్ధం. ఏ ఒక్కరు ముందుకు రాలేదు, కనీసం అలికిడి కూడా లేదు. అయితే ఒక చిన్న బాబు ముందుకు వచ్చాడు, ఆ యవ్వనస్తుడు బాబును ఎత్తుకొని ముద్దాడి తన భుజాలపై కూర్చోపెట్టుకొని రెండవసారి తాడుపై నడిచి లోయను దాటాడు. అందరూ ఆశ్చర్యపోయారు. కొంతమంది "బాబు నీకు భయం వేయలేదా?" అని పిల్లవాడిని అడిగారు. అప్పుడా పిల్లవాడు "ఎందుకు భయం నేను చాలాసార్లు మా నాన్న భుజాలు ఎక్కాను. మా నాన్న నన్ను జాగ్రత్తగా గమ్యం చేరుస్తారని నాకు తెలుసు" అన్నాడు. అప్పుడు అర్థమైంది ఈ బాబు ఆ యవ్వనస్తుని కుమారుడని.

త్రాడుపై యవ్వనస్థుడు నడిచినప్పుడు క్రింద ఉన్నవారందరూ చూశారు కాబట్టి అతడు ఆ లోయను దాటగలడు అని నమ్మారు. అయితే తనతో ప్రయాణించ దానికి ఆహ్వానించినప్పుడు ఒక్కరు కూడా ముందుకు రాలేదు అంటే ఆ యవ్వనస్థున్ని ఎవ్వరూ విశ్వసించలేదు. చూడటం ద్వారా కలిగేది కేవలం నమ్మకం మాత్రమే. వ్యక్తిగతమైన సంబంధం వలన కలిగే నమ్మకం విశ్వాసంగా మారుతుంది. ఆ యవ్వనస్తుని శక్తి సామర్థ్యాల గురించి నిలబడి చూస్తున్న వారికి తెలియదు కాబట్టి అతనిని విశ్వసించలేదు. అందుకే అతనితో కలసి ప్రయాణించుటకు ఎవరూ సాహసించలేదు. అయితే తన తండ్రితో ఉన్న అనుబంధాన్నిబట్టి ప్రతిదినం తండ్రితో గడిపే సమయాన్ని బట్టి కొడుకుకి మాత్రమే తండ్రిపై అచంచలమైన విశ్వాసం ఉంది.

మనం కూడా అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి.. ప్రతి ఒక్కరు దేవున్ని నమ్ముతారు. అయితే దేవున్ని వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే మనకున్న నమ్మకం విశ్వాసంగా మారుతుంది. క్రమమైన ప్రయత్నం, కార్యాచరణనుబట్టి విశ్వాసం బలపడుతుంది, కదిలింపబడని విశ్వాసంగా మారుతుంది. ఎప్పుడైతే అటువంటి అచంచలమైన విశ్వాసం కలిగి ఉంటావో అప్పుడు నీవు దేవునితో కలిసి నడుస్తావు సాహసకార్యాలు చేయగలుగుతావు నీవు ఒక విశ్వాస వీరుడవు/ వీరురాలివై చరిత్ర పుటల్లో నిలబతావు.

***"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా" హెబ్రీ. 4:11***

సాక్ష్యము

# నిజ దేవుడు

శ్రీ. వి.జె. పట్నాయక్

నిజముగా మన దేవుడు మాట్లాడే దేవుడు. తృష్ణగొనిన ప్రాణాన్ని సేదదీర్చే దేవుడు. ఎంతో మంది హైందవ సోదరులు సోదరీమణులు నిజ దేవుడైన క్రీస్తును ఎరుగక ఇంకను చీకటిలో బ్రతుకుచున్నారు. వారికి నా ఈ సాక్ష్యము కొంతైనా కనువిప్పు కలుగజేస్తుందని ఆశిస్తున్నాను. కొంతమంది దేవునిని స్వీకరించాక వచ్చే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలో సంశయిస్తుంటారు. వారికి నా బంధువుల అనుభవం కొంత ఊరటని కల్గిస్తుందని ఆశిస్తూ ఈ సాక్ష్యాన్ని మీతో పంచుకుంటున్నాను.

నేను క్రైస్తవుడనైయున్నందుకు సంతోషించు చున్నాను. ఎందుకనగా, సత్యమునెరిగిన అనేకులు – కాదు అనలేని సత్యం, అవును అనలేని మనస్సుల మధ్య నలిగి సతమతమగుచున్నారు. నా తండ్రి తరపున తాతలు గంద్రేటి అప్పల నర్సయ్య పట్నాయక్ (మెంటడ) ఆయన సతీమణి జానకమ్మ (పిట్టాడ). తల్లితరపున శ్రీ పంగ అప్పన్నదొర (సోంపేట) ఆయన సతమణి రాధామణమ్మ (పర్లాకిమిడి). కులమును, ఆస్థులను, స్వకీయులను వదిలి క్రీస్తునందు విశ్వసించిన హేతువు చేత క్రీస్తును అంగీకరించు భాగ్యము నాకు ప్రయాసలేకుండా కలిగినది.

యేసుక్రీస్తునందు విశ్వసించినందున అప్పల నర్సయ్య పట్నాయక్ గారిని, ఆయన కుటుంబమును వెలివేసి చాకలి, మంగలి వారి సేవ అందకుండునట్లును, మంచినీటి బావి యొద్దకు రాకుండునట్లును చేయగా ఆస్థులను, మంటిని వదిలి భీముని పట్టణమునకు వలస పోయి అప్పటికే విద్యావంతులైనందున సువార్తికులు గాను, ఉపాధ్యాయులుగాను జీవనము చేసిరి. పంగ అప్పన్న దొరగారు సువార్త వినుచు ఎవరు నిజదేవుడని ఆలోచిస్తూ కూలీలను పంపిన తరువాత ఇంటికి వచ్చుచుండగానే నేనే నిజమైన దేవుడను అను స్వరము విని క్రీస్తునందు విశ్వసించెను.

శ్రీ పంగ అప్పన్నదొరగారి భార్య తన కుటుంబమును కుటుంబ గౌరవమును వదలలేక భర్తగారిని విడిచి కన్నవారింటికి వెళ్ళిపోయెను. కొద్దికాలములోనే మృత్యువు ఆమెను స్వీకరించినది. ఈయనను తన స్వకీయులు విసర్జించిన రీతిని రాధామణమ్మగారు తృణీకరింపబడి దిక్కులేక క్రైస్తవుల వసతి గృహములో జీవించుచున్న పరిస్థితులలో ఆమెను పెండ్లిచేసుకొనిరి. ఈమె చరిత్ర – ఆసక్తిదాయకము. ఆమె బాల్యవిధవ. ఆమెకు జ్ఞానము తెలియని వయస్సులో ఆనాటి ఆచారానుసారముగా వివాహము జరిగెను. ఆమె భర్త ఎవరో తెలియని వయస్సులో ఆ బాలుడు చనిపోయెను. ఈమె తన కుటుంబికుల ఆచారమర్యాదలు అనుసరించుచు నిష్టగల బ్రాహ్మణ విధవగానుండెను. ఇట్లు జీవించుచు తల్లిదండ్రుల పోషణలో ఉంటు, పుణ్యక్షేత్రములకు యాత్రలు చేయుచుండిన విగ్రహారాధికురాలు. అట్లు పూరి, జగన్నాధము మొదలగు ప్రాంతములకు యాత్రకై వెళ్ళుచుండగా యేసుక్రీస్తు సర్వజనుల రక్షకుడని, పాపప్రాయశ్చిత్తార్థ బలిగా తన్నుతాను అర్పించుకొనిన పాపవిమోచకుడని విని మనస్సున దాచుకొని ధ్యానము చేయుచుండగా వంశ పారంపర్యాచారముల వలన, హిందూ మత సిద్ధాంతముల వలనను, తల్లిదండ్రుల యొక్క బంధుమిత్రుల నిర్భంధన వలన ఎటుతోచకయున్న సమయములో ఆమె యొక్క చెల్లెలి వివాహ సందర్భములో ఆమెను తన అత్తవారింటికి పంపుచు ఈమెను తోడుగా పంపిరి. చెల్లిని అత్తగారింట చేర్చిన తరువాత తిరుగు ప్రయాణములో ఆమెకు తోడుగా పంపిన పనివాడు ఎద్దుల బండినడుపుచు ఆమెను స్వగృహమునకు తీసుకొని వచ్చుచుండగా బొబ్బిలి పట్టణము సమీపించెను. అక్కడ రోడ్డుకు సమీపమున మిషెనరి బంగళాను ఆమె గుర్తించి, బండిని ఆపమని బండిని నడుపుచున్న పనివానికి చెప్పి, మూత్రవిసర్జన చేసివస్తాను అని చెప్పి రోడ్డుప్రక్కన

బంగళా వరకు గల తుప్పలలోపడి మిషెనరీ వారి యొద్ద చేరెను. ఎంతసేపటికి రానందున పనివానికి దిక్కు తోచకుండెను అయినా సాహసించి తుప్పలలో చుట్టూ వెదకినను ఆమెను కానక వెళ్ళిపోయెను. ఇట్లు ఆమె మంచి ధైర్యము కలిగి సాహసించి క్రీస్తును విశ్వసించెను.

నా తల్లిదండ్రులు విశాఖజిల్లా వాస్తవ్యులు. నా తండ్రిగారు ఉద్యోగరీత్యా కాకినాడ పట్టణములో స్థిరపడిరి. ఆయన హెడ్ పోస్టుమాస్టరుగా రిటైరు అయిరి. 1946 సం॥లో కాకినాడలో నేను విద్యనభ్యసించితిని. 1946 –1949 వరకు బాపట్ల వ్యవసాయ కళాశాలలో బి.యస్సి. పట్టభద్రుడనైతిని. నాకు తమిళనాడులోని ఆంబూరు పట్టణ వాస్తవ్యులైన జార్జి జెర్మియాగారి ప్రధమ కుమార్తెతో వివాహము చేసిరి. అనేకులు, ఇంచుమించు అందరు ప్రేమ వివాహమనుకొనుచున్నారు. కొందరైతే ముఖాముఖిగా అడుగుచున్నారు. కొందరు మనస్సులో అనుకొనుచున్నారని కాదు గాని ఆంధ్రునికి తమిళ కన్యకు ఎట్లు సంబంధము కుదిరింది అనేది ప్రశ్న? చాలా పెద్ద ప్రశ్న?

అద్భుతము అంటే ఇదే. ఎట్లనగా నా భార్య యొక్క పెద్ద అన్నతో నేను వ్యవసాయ డిపార్టుమెంటులో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌గా కలిసి పనిచేసేవారము. కలిసి క్యాంపులు వెళ్ళేవారము. నేను ఆత్మకూరు పట్టణములోను, ఆయన నెల్లూరు పట్టణములోను పనిచేయుచుండేవారము. ఆయనను నేను గమనించేవాడను. ఆయన నన్ను గమనించేవాడు. పొగత్రాగుట, సినిమాలకు పోకుండుట ఇతర దురలవాట్లు మా ఇద్దరికి లేకుండెను. తలగడ క్రింద పరిశుద్ధ బైబిలు గ్రంధము పెట్టుకొనే అలవాటు ఇద్దరికి ఉండెను. ప్రాతఃకాలము పడకమీద నుండగానే పరిశుద్ధ గ్రంధము చదివి, ప్రార్ధించిన పిమ్మట పనిపాటలు చూచుకొనేవారము. మద్రాసు రాష్ట్రమును ఆంధ్రప్రదేశ్, తమిళనాడుగ విభజించినపుడు నా బావగారు ఆంధ్రప్రదేశ్ లో ఉండిపోయారు. ఎందుకనగా చిత్తూరు జిల్లాలో వారికి స్థిరాస్థులున్నవి. చిత్తూరు మద్రాసు రాష్ట్ర సరిహద్దు ప్రక్కనే యున్నది. ఇట్లు మేము కలసి పనిచేయుచుండగా ఆయనకు ముగ్గురు చెల్లెండ్రు యున్నట్లు పెద్దఆమెకైతే మాకు సంబంధము ఏర్పాటు చేస్తానన్నారు. అయితే చూడాలి కదా, చూడకుండ ఎట్లు చెబుతాను? అనగా – అర్జంటుగా తన దగ్గరున్న కుటుంబము యొక్క పాత ఫోటో పంపెను. అందు పెద్ద చెల్లెలికి గుర్తు వ్రాశారు. ఆ జాబు చదువకముందు ముగ్గరిలో ఒక అమ్మాయిని ఎంచుకున్నాను. ఆ తరువాత జాబు చదివాను. నేను ఎంచుకున్న అమ్మాయి జాబులో వ్రాసిన అమ్మాయి ఒకటే. తల్లిదండ్రుల సమ్మతి కావాలి కదా అని చెప్పి ఫోటో నా తల్లిదండ్రులకు పంపుచు వారిని కూడా జాబు చదువక ముందు అమ్మాయిని ఎంచుకోమని తరువాత జాబు చదవమని వ్రాశాను. వారు కూడా ఆ అమ్మాయినే ఎంచిరి. ఇట్లు సంబంధము కుదిరింది. పెండ్లి చూపులలో కలుసుకొనువరకు మేము ఒకరినొకరము చూచుకోలేదు. వివాహము 1952 జనవరి 11వ తేదీన జరిగెను. మా ఉభయ కుటుంబముల క్రైస్తవ విశ్వాసము బైబిలును ఆధారము చేసుకొనియుండెను. ఇప్పుడు నా వయస్సు 85 సంవత్సరాలు. నా భార్య కు 81సం॥లు. మాకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కోడండ్రు. ఒక కుమార్తె, ఒక అల్లుడు, నలుగురు మనుమలు, ఐదుగురు మనుమరాండ్రు ఇద్దరు మునిమనుమలు, ఒక ముని మనుమరాలు గలరు. దేవునికి స్తోత్రములు.

మరియొక అద్భుతము – నా భార్య యొక్క తాతగారి పేరు శ్రీ జి.వి. వేదనాయగం. ఈయన మధురై జమిందారుగారి కుమారుడు. ఈయన తండ్రి నాగరాజు భక్తుడు. ఆయన అతి భక్తి కలిగి బ్రతికియున్న నాగుపాము ను పూజ గదిలో ఉంచి పూజచేయుచుండెడివాడు, ప్రాతః కాలమున ఐదు గంటలకు పూజ గదికి వెళ్ళి తలుపులు మూసి గంట మ్రోగించుచుండగా పీట క్రిందయున్న నాగుపాము వచ్చి పడగ ఊపుచు గ్రుడ్డు తిని పాలు త్రాగుచుండేది. ఇది ఆయన ప్రతి దినచర్య. ఆయన పూజ చేయుచున్న సమయములోనే ముగ్గురు క్రైస్తవ ప్రచారకులు పాటలు పాడుచు యేసుక్రీస్తుని స్తుతించుచు వెళ్ళేవారు. ఇట్లు ప్రతిదినము జరుగుచుండగా ఆయన సహించలేక

వారిని పిలిపించి ఈ రీతిగా రహదారిలో పాడుట యుక్తముగ లేదు. ముఖ్యముగా నా పూజకు అంతరాయము కలుగుచున్నది. గనుక ఈ మార్గమున రావద్దని హెచ్చరించెను. కాని వారు యథావిధిగా వచ్చుచుండేవారు. ఇట్లు నా పూజకు అంతరాయము కలిగించుచున్నారు. కాబట్టి మరల వచ్చిన మిమ్మును కొట్టించెదనని హెచ్చరించెను. అయినను పాటలు పాడుచు యేసుక్రీస్తుని స్తుతించుచు కీర్తనలు పాడుచు వచ్చిరి గనుక తాను చెప్పినట్లు ఆయన పనివారు వారిని కొట్టి గాయపరిచిరి. అయినను మరునాడు గాయముకు కట్లు కట్టుకొనివచ్చిరి. అప్పుడు వారిని పిలిచి ఇది ఆఖరు హెచ్చరిక. మరల వచ్చిన నిశ్చయముగా మిమ్ము చంపించెదనని బహు ఆగ్రహముతో హెచ్చరించెను. ఇదంతా ఆయన కుమారుడైన జి.వి. వేదనాయగం గమనించుచుండెను. ఈయన తనలో తాను క్రీస్తు సేవకుల భక్తి తాత్పర్యమును గూర్చి ఆలోచించుచు, తన తండ్రి చెప్పింది చేసే వ్యక్తి కదా ఏమి జరుగునో అని భయపడి ఒక తీర్మానము చేసుకొనెను. నిజ దేవుడెవరో రూఢిగా ఈ రాత్రి తెలుసుకోవలెను. అంతవరకు నిద్రించకూడదని దీక్ష వహించి ధ్యానించుచుండెను. ఎవరు నిజదైవమో తెల్లవారక మునుపు ప్రత్యక్షము కావలెనని కనిపెట్టుచుండెను. నిద్ర కాయలేక తెల్లవారు జాము నాలుగు గంటలకు కునికెను. మగత నుండగా దీపపు వెలుగులో పొగ వచ్చుచున్నట్లు కనబడెను. ఆ పొగలో నాగుపాము కనబడినది. ఆయన భయభ్రాంతుడై తనను ఏమి చేయవద్దని మనవి చేయుచుండగా ఉరుము వంటి శబ్ధము వెంటనే ప్రకాశమానమైన వెలుగు వచ్చెను. ఆ వెలుగులో సిలువ కనబడెను. ఆ సిలువలో నుండి “నీ తండ్రి హింసించుచున్న యేసు క్రీస్తును” అను స్వరము స్పష్టముగా వినబడెను. నన్ను వెంబడించుము, నీ తండ్రి పూజించుచున్న పామును దాని పన్నెండు పిల్లలను పట్టుకొని నా వెంబడి రమ్ము, నేను చూపించు స్థలములో వాటిని వేయుమనెను. దానికి పిల్లలు లేవు అని అనగా సరిగా చూడు పిల్లలున్నవని శబ్ధము వచ్చెను. వాటిని పట్టుకొనగా ఆయనను ఎత్తైన కొండపైకి తీసుకొని వెళ్ళి పెద్ద అగాధమును చూపించి అగాధములో పడవేయించెను. వెంటనే మెళకువ వచ్చెను. తక్షణము పనివారిని ఆ సువార్తికులకు హాని చేయవద్దని చెప్పి తండ్రికి విషయము తెలుపుటకు పరుగున పోయెను. తలుపు తట్టగా తండ్రి పూజ గది తలుపు వేయలేదు. వేళమించిపోయినను ఆయన రానందున తలుపు బద్దలు చేసిచూడగా ఆయన చనిపోయి ఉండెను. కారణమేమని వైద్య పరీక్ష చేయించగా ఏదో విషపురుగు వలన మరణించినట్లు నిర్ధారించిరి. వెంటనే మా తాతగారు సాహసించి ఎంతమంది వద్దనినను నాగుపామును చంపించెను. దర్శములో చూచినట్లు ఇంక పన్నెండు పిల్లలు గలవు. వాటిని కూడా చంపమనగా అపహాస్యము చేసిరి కాని ఆయన పట్టువదలనందున పూజ సామానులు తీసిచూడగా ఒక మూల పన్నెండు పిల్లలు కూడా కనబడెను. వాటిని చంపి వేయించెను. వెంటనే క్రీస్తు సేవకులను పిలిపించి కుటుంబ సమేతముగా కన్యాకుమారి నదిలో బాప్తీస్మము తీసుకొనిరి. ఆ విధముగా వారి సంతతివారు నిజ దేవున్ని ఎరిగి ఆయనను ఆరాధించినారు.

దేవుని అనాది సంకల్పము వలన నా కుటుంబములో చాలా మంది నిజ దేవుడైన యేసుక్రీస్తును తన స్వంత రక్షకునిగా అంగీకరించినారు. ఇంకా దేవుని ప్రేమను రుచి చూడ వలసిన వారు అనేకులు కలరు వారందరి నిమిత్తము మీ అనుదిన ప్రార్థనలో ప్రార్థించవలసినదిగా మనవి


**ఇంటర్నెట్‌లో ‘పరిశుద్ధత’ మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - ఎజ్రా

పిల్లలూ!ఎలా ఉన్నారు? దసరా సెలవులు బాగా ఎంజాయ్ చేశారా? సెలవులు ఆ తర్వాత పరీక్షలు అయిపోయాయి కదా! మరీ ఇప్పుడైనా మీ బిజీ షెడ్యూల్ నుండి దేవునికి కొంత సమయాన్ని కేటాయించి, దేవుని జ్ఞానాన్ని తెలుసుకుందాం. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

ఈ సంచికలో దేవుని మందిరం పట్ల ఆసక్తిని కనబరిచిన వ్యక్తుల గురించి తెలుసుకుందాం.

ఇశ్రాయేలీయులు, యూదులు బబులోను దేశంలో బానిసలుగా ఉన్నారు. బానిసలుగా ఉన్నప్పటికి చాలా మంది యూదులు దేవునిపై ఇంకా భయభక్తులు కొనసాగిస్తూనే ఉన్నారు. బబులోను సామ్రాజ్యం పారశీకుల అధీనంలోకి వెళ్ళింది. కోరెషు రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. బబులోను రాజైన నెబుకద్నెజరు కాల్చివేసిన యెరూషలేము పట్టణాన్ని 70 సం॥ల తర్వాత మరల కట్టిస్తాను అని దేవుడు ముందుగానే యిర్మీయా ప్రవక్త ద్వారా సెలవిచ్చిన ప్రకారం కోరెషు రాజు బానిసలుగా ఉన్న యూదా, ఇశ్రాయేలీయులను, తమ స్వంత దేశాలకి వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు. అంతేకాదు యెరూషలేము మందిరాన్ని తిరిగి కట్టడానికి కూడ అనుమతి ఇచ్చాడు. కాబట్టి బబులోను నుండి చాలా మంది యూదులు తిరిగి యెరూషలేము రావడానికి సిద్ధపడ్డారు.




మొదటగా బబులోను నుండి దాదాపు 50000 మంది యెరూషలేముకు వచ్చారు. వీరిలో షయల్తీయేలు కుమారుడైన జెరుబ్బాబెలు, యోజాదా కుమారుడైన యేషూవ ముఖ్యులు. బబులోను నుండి వచ్చిన యూదులు బలిపీఠాన్ని సరిచేసి దేవునికి బలులైతే అర్పించారు కానీ దేవుని మందిరాన్ని కట్టలేదు. రాజాజ్ఞ ప్రకారం అక్కడి అధికారులకు పన్నులు కట్టేవారు. యూదులు తాము వచ్చిన 2 సం॥లకు దేవుని మందిరానికి పునాదులు వేశారు. అయితే అక్కడ నివశిస్తున్న ప్రజలు యూదులకు వ్యతిరేకంగా రాజుకు ఫిర్యాదు చేయగా రాజు దేవుని మందిర నిర్మాణాన్ని ఆపివేయమని ఆజ్ఞ ఇవ్వడంతో మందిర పని ఆగిపోయింది. అలా దర్యావేషు అనే రాజు అధికారంలోకి వచ్చే దాకా యెరూషలేము మందిర నిర్మాణం ఆగిపోయింది. ఆ తరువాత ప్రవక్తలైన హగ్గయి, జెకర్యాల ద్వారా దేవుడు హెచ్చరించగా దేవుని మందిరాన్ని కట్టడం ప్రారంభించి మందిర నిర్మాణాన్ని ముగించారు. బబులోను రాజైన అర్తహషస్త అతని మంత్రులు యెరూషలేము మందిర నిర్మాణాన్ని అక్కడి పరిస్థితులను విచారించి తెలుసు కొనుటకు, అక్కడి యూదలను మోషే ధర్మశాస్త్రం ప్రకారం నడిపించుటకు ఎజ్రా అనే వ్యక్తిని పంపారు.

ఎజ్రా లేవి గోత్రానికి చెందిన వాడు. ఎజ్రా నాన్న పేరు శెరాయా. ఎజ్రా మోషే ధర్మశాస్త్ర గ్రంథం గురించిన జ్ఞానం కలిగిన శాస్త్రి. అంతేకాదు ధర్మశాస్త్రం ప్రకారం జీవించడానికి పూనుకున్నవాడు. అంటే దేవునికి ఇష్టమైన జీవితాన్ని జీవించే వ్యక్తి. ఎజ్రా దాదాపు 150 రోజులు ప్రయాణించి బబలోను నుండి యెరూషలేము చేరుకున్నాడు. ఎజ్రాతో పాటు కొంతమంది యూదులు కూడా యెరూషలేముకు వచ్చారు. ఎజ్రా ఏమి అడిగినను రాజు ఖజానాలో

నుండి అది అతనికి ఇచ్చే విధంగా రాజైన అర్తహషస్త నుండి తాకీదును పొందాడు. అంతే కాదు తనతో పాటు కొంత మంది లేవీయులను, బబులోనులోని యూదులు, లేవీయులు స్వేచ్ఛగా అర్పించిన కానుకలను, బంగారు ఉపకరణాలను తీసుకొని యెరూషలేముకు వచ్చాడు. తెచ్చిన బంగారు దేవుని ఉపకరణములను దేవుని సన్నిధిలో సమర్పించి దేవుని మందిర ఖజానాలో నమోదు చేయించాడు. ఎజ్రా మోషే ధర్మశాస్త్రము నందు ప్రవీణత కలవాడు కావడంతో మందిర ప్రతిష్ఠ మరియు యాజకుల పనులు యాజకత్వ నియమాలు జనులకు తెలిపి వారికి మార్గదర్శం చేశాడు. తిరిగివచ్చిన యూదులు అన్యులను వివాహమాడి దేవుని ఆజ్ఞను అతిక్రమించగా ఎజ్రా వారిని వారించి వారి నిమిత్తం తమ పితరుల పాపాలు తన తరము వారి పాపాలు ఒప్పుకుంటూ ఆకాశమందున్న దేవునికి ప్రార్థన చేశాడు. దేవుని కరుణా వాత్సల్యతలను గుర్తుచేసుకుంటూ తన ప్రజలు చేసిన తిరుగుబాటుతనానికి క్షమాపణ వేడుకున్నాడు. దేవుని కృపను, యెరూషలేమ మీదికి వచ్చిన దేవుని శిక్షను జ్ఞాపకం చేస్తూ ప్రజలందరి నిమిత్తం క్షమించమని ప్రార్థన చేశాడు. ఎజ్రా ప్రార్థన విన్న యెరూషలేము ప్రజలు తమ పాపాలు ఒప్పుకుంటూ తమ దేవునికి విరోధముగా చేసిన పాపము నిమిత్తమై దేవునిని క్షమాపణలు వేడుకొని తాము చేసిన పాపానికి ప్రాయశ్చిత్తముగా వారు పెళ్ళాడిన అన్యులను వదిలిపెట్టారు.

ఎజ్రా దేవుని ధర్మశాస్త్రంలో మంచి ప్రవీణత కలిగిన శాస్త్రి. తాను ఏ దేశంలో ఉన్నప్పటికి ఎలాంటి పరిస్థితులలో తాను బ్రతుకుతున్నప్పటికి దేవుని ధర్మశాస్త్రం ప్రకారం జీవించే వ్యక్తి. యెరూషలేము పట్టణం పాడైపోయి ప్రజలు బానిసలుగా ఉంటున్నప్పటికి ఎందుకు ఇలా చేశావు ప్రభువా అని ఎజ్రా దేవునిని ప్రశ్నించలేదు.తాను బబులోను చెరలో ఉన్నప్పటికి దేవుని కృపను, కరుణను మరచిపోక తాము అనుభవిస్తున్న బానిసత్వానికి కారణం తాము చేసిన పాపాలు దోషలే కారణం అని తన పాపాలు తన ప్రజల పాపాలు ఒప్పుకున్నాడు. దేవుని ప్రజలకు సరియైన మార్గాన్ని చూపించి వారిని దేవుని మార్గంలో నడిపించాడు. అందుకే దేవుని గ్రంథంలో స్థానం సంపాదించాడు.

పిల్లలూ మరి మనం కూడా ఎజ్రా వలె ఎప్పటికప్పుడు మన పాపాలను దేవుని దగ్గర ఒప్పుకొని విడిచిపెడదాం. పరిస్థితులు ఎలా ఉన్న ఎల్లప్పుడు దేవునిని స్తుతించాలి. దేవుని గ్రంథమైన బైబిల్ ప్రకారం జీవించుటకు ప్రయత్నిద్దాం. దేవుని బిడ్డలుగా మంచి పేరొందుదాం.




**హన్నాకృప**

**క్రిస్టియన్ బుక్ సెంటర్**

**రైల్వేస్టేషన్ రోడ్, క్లౌపేట, 6వ లైను, ఒంగోలు-523001, ఫోన్: 9440217726**

**మా వద్ద అన్నిరకముల బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్, సండేస్కూల్ బైబిల్ గేమ్స్ మొదలగునవి లభించును. మీకు కావలసిన బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్ ఈ క్రింది వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చును**

**www.onlinetelugubible.net**

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

## 8. ధన్యతలు : నీతికోసం తృష్ణ - ధన్యతైన తృప్తి

## Beatitudes

**"నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు ;వారు తృప్తిపరచబడుదురు" – మత్త. 5:6**

"Blessed *are* they which do hunger and thirst after righteousness; for they shall be filled"_ KJV

**లోకంలో అనేక సందర్భాల్లో నీతి లేని వారే నీతిని గురించి మాటలాడేది ; అధికార ధనదాహంతో తృప్తి లేనివారే తృప్తిని గురించి తబలా వాయిస్తుంటారు. నీతిని వెదకటం ఒక ధన్యత కావాలంటే ఆ నీతి ఏమైయుండాలి దానిని ఏ మేరకు వెదకాలి అనే దాన్ని క్రొత్తకోణాల్లో చూద్దాం.**

ఈ వ్యాసం క్రొత్తకోణాల శ్రేణిలో ఎనిమిదోది, ధన్యతల వరుసలో నాలుగోది. ఈ ధన్యతలోని నీతి, ఆకలిదప్పులు అనేవి ఈనాటి వాడుకలో ఎలాంటి అర్థాలు సంతరించుకొనింది, క్రీస్తు సూక్తులుగా చెప్పిన ధన్యతల సందర్భంలో కొంత అర్థమౌతాయి. కనుక మొదట ఈ విషయాన్ని పరిశీద్దాం.

### నీతి (Righteousness)

ఈ మాట డైకాయియోసూనె (dikaiosune) కు సమమై న్యాయము (Justice) లేక నీతిమత్వము (Righteousness) నుండి వచ్చింది. ఈ నీతి దేవుడు కోరే న్యాయాన్ని నెరవేర్చేది. అది దేవుని తీర్పునకు సంబంధించిన పరీక్షలో నెగ్గేది (2కొరిం.3:9, 6:4 ఎఫె. 4:24). దేవుని బోలు నీతి (మత్త.6:33, యాకో.1:20). దేవుని నీతి మానవుని మీద ఆయనకు గల హక్కు. ఇది మానవుడు గుర్తెరిగి దేవుని హక్కుకు పూర్తిగా విధేయుడు కావాలంటే, దేవుడు తనను తానెట్లు మానవునకు దత్తం చేసుకొంటాడో అదే విధంగా దేవునిని స్వీకరించాలి (రోమీ.5:17). ఈ దైవ హక్కును విశ్వాసము ద్వారా గుర్తెరిగినపుడది ధర్మ శాస్త్ర సంబంధమైన నీతికి వ్యతిరేకమౌతుంది (రోమీ.10:5, గల.3:21). మానవుడు పాపము ద్వారా పతనమైన కారణంగా సహజంగా తనకు తానుగా ఏర్పరచుకొనిన, సృష్టించుకొన్న నీతి ప్రమాణాలను స్వీకరిస్తుంటాడు (రోమీ.10:3 ; ఫిలి.3:6). అయితే, అట్టివి నీతి కాదు (రోమీ. 10:5,13 ; గల.3:21), అట్టిది దేవునికి ఆమోదకరము కాదు. దేవుని నీతి మానవునికి దేవుని ఉచిత కృపావరముగా ఆపాదింపబడినది. అది మానవుడు సంపాదించుకొనునది కాదు.

> **పునశ్చరణ (Recapitulation)**
>
> **❑ ధన్యతలన్నింటికీ వర్తించే కొన్ని విషయాలను గత మాసం కొంత వివరంగా పొందుపరచటం జరిగింది. క్రొత్త చదువరులు, పాతవి గతించినవన్నట్లు క్రొత్తగా మొదలు పెట్టే చదువరులు కొన్ని విషయాలు గుర్తు చేసుకొంటేగాని వాని నేపథ్యం అర్థంకాదు.**
>
> **❑ కొండమీది ప్రసంగం (మత్త. 5,6,7 అ.) యేసురాజు పరలోకరాజ్య ప్రణాళిక** (Manifesto of the The Kingdom of Heaven) **అయితే అందలి తొలి పలుకులయిన 'ధన్యతలు' ఆ చట్టాంగానికి అవతారిక** (Preamble) **అనవచ్చు. అంటే యేసురాజ్య మౌలిక సూత్ర సంక్షిప్త సంచయంగా పరిగణించాలి.**
>
> **❑ ధన్యతల వాక్యనిర్మాణం ఇంగ్లీషులో** *are* **అనే క్రియతో భావార్థకాలు** (Statements) **కాగా, హెబ్రీ/అరామిలలో అవి క్రియాపదంలేని ఆశ్చర్యార్థకాలు** (Exclamations). **తెలుగులో ఇంగ్లీషు వరుసే వచ్చింది. 'దుఃఖపడువారు ధన్యులు (అయియున్నారు)' అనే వాక్యం 'దుఃఖపడటం ఎంత ధన్యత' అవుతుంది.**
>
> **★ ధన్యత అనే మాటకు గ్రీకుపదం 'మాకరియోస్'** (Makarios). **దీని అర్థం ఆ మాటను పేరుగాగల కుప్ర** (Cypres). **ద్వీపాన్ని బట్టి గ్రహించవచ్చు. ఈ ద్వీపం ఒక ఆనందమయ ద్వీపం. సుందర సిరిసంపదానిలయం. సహజ ఖనిజ సంపత్తి, సస్యశ్యామలం అయిన లోటులేని చోటు. అలాంటి పరిపూర్ణ సంతోషదాయినినే ధన్యతగా గ్రహించాలి. ఇది పరలోక నివాసానికి ఇహలోక సాదృశ్యం.**
>
> **వ్యాసరచనోద్దేశం :**
>
> **పాత నిబంధనలో అబ్రాహాము మొదలు దేవునిని వెంబడించిన వారికి వాగ్దానం చేయబడ్డ దీవెనలు కోకొల్లలు (ఆది. 10:1-3, మలా. 3:10-12). అందుకు ప్రతిగా మన మా దేవుని జనంగా ఉండాలని పదిఆజ్ఞల్లో మన జీవితశైలిని పొందుపరచాడు. వానినే యేసు 'వద్దు', 'కూడదు' అనే మాటల్లో కాకుండా సానుకూల** (Positive) **పదాల్లో ధన్యతలుగా అభివర్ణించాడు. వినగానే యివెలా ధన్యతలురా బాబూ అన్నవి అనన్య బహుమాన సాధకాలుగా కొంత నిగూఢంగా ప్రకటించాడు. దీనిని ఆయన ఉద్దేశించిన క్రొత్త కోణాల్లో పరిశీలించడమే ఈ వ్యాసాల ఉద్దేశం.**

### ఆకలిదప్పులు (Hungur & thirst)

మాటలు శూన్యంలో అర్థరహితాలు. ఒకరి అనుభవంలోనే అవి సార్థకాలవుతాయి. అందువల్ల నేటి అధునాతన జీవిత శైలిలో ఆకలికొనటం, దప్పిగొనటమనేది ఏమంత గొప్ప విషయంగా ఎంచం. ఆకలివేసే– కనీసం, వేళలో ప్రేవులు కదిలితే, ఒక బిస్కట్టు కొరుకుతాం. దప్పికవేస్తే ఫ్రిజ్‌నుండి తీసి ఒక కోక్‌ను సిప్ చేస్తాం. లేకుంటే నిత్యం అందుబాటులో ఉండే పంపు త్రిప్పి నీరు పట్టుకుంటాం. అయితే, యేసు పాలస్తీనాలో, యెడారి ప్రాంతాలున్న పాలస్తీనాలో సంచరిస్తూ ఈ ధన్యతల్ని ప్రతిపాదించిన కాలంలో ఒక కూలినాలి చేసుకొని బ్రతికే వాని దినకూలి రెండు మూడు పైసలు (ఒక స్త్రీ రెండు కాసుల కానుక వేసిన సంఘటన గుర్తుంచు కోవాలి). ఇప్పటికీ, అప్పటికీ డబ్బు విలువలో, కూలీలో తార తమ్యం వుంది. అయినా, ఆ రోజుల్లో వారి సంపాదనతో శుష్టిగా భోజనం చేయటం కష్టతరం. వారానికో సారి కూడ మాంసం తినలేరు. అలాంటి వారు ఆకలికి పస్తులకు అతి సమీపంలో ఉంటూ, ఆకలంటే ఏమిటో గ్రహించ గలరు.

దప్పిక విషయంలో పాలస్తీనా వారి అనుభవం మరీ దారుణంగా ఉంటుంది. ఒక మనిషి పోతూ ఉంటే హఠాత్తుగా ఇసుక తుఫాను రేగుతుంది. తన తలపాగా చివర గుడ్డను నోటికి ముక్కుకు అడ్డం చుట్టుకొని గాలివాటుకు వీపు త్రిప్పి నిలబడటంకన్న చేయగలింది లేదు. ఎంత గుడ్డ అడ్డమున్నా సూక్ష్మ ఇసుక రేణువులు ముక్కులో, అంగిట్లో, గొంతులో పారకడుతుంది. పిడచకట్టిన గొంతు, నాల్కలతో ప్రాణం పోతుందనే దశలో చిటికెడు నీరు దప్పిక తీరుస్తుందనే సందర్భంలో గాని దప్పికంటే ఏమిటో అర్థంకాదు.

కనుక, ఈ నాలుగో ధన్యతలోని ఆకలి ఏదో సుతిమెత్తని ఆకలి కాదు ; రోజులు తరబడి పస్తుల్తో ప్రేవులు పీక్కుపోయే ఆకలి, గ్రుక్కెడు నీరు త్రాగితేగాని ప్రాణాలు మింట కలుస్తాయనే దప్పిక. అందుకని, ఈ ధన్యత ఒక ప్రశ్న, ఒక సవాలు విసరుతుంది. అది, లోగడ చెప్పబడిన దేవుని నీతిని (మంచి తనాన్ని) ఏ స్థాయిలో వాంఛిస్తున్నావ్? ఆ మలమల పస్తులతో మాడేవాడు ఆకలితో కమికెడన్నం కోసం కోరేంతగా, లేక నాలుక పిడచకట్టుక పోయినవాడు నీటికోసం చూచినంత తీక్షణంగానా?

మానవమాత్రులకు సహజంగా (instinctively) నే నీతికోసం

తపన ఉంటుంది. యౌవనకాలంలో ఆదర్శవాదం ఎక్కువగా ఉండే రోజుల్లో నీతికోసం ప్రాణాలనైనా ఇయ్యాలనే వారుంటారు. రాను రాను ఎక్కువమందిలో నీతిగా ఉండాలనే వాంఛ మన ఊహల్లో దోబూచులాడే కమ్మని దృశ్యంగా ఉంటుందేగాని నిశితంగా, తీవ్రంగా మాత్రం ఉండేదికాదు. ఒక పరీక్ష సమయం వస్తే ప్రయాస పడాలనిగాని, త్యాగం చేయటానికి గాని జారిపోతాం. ఈ సంక్షోభాన్నే రాబర్ట్ లూయిస్ స్టీవెన్‌సన్ 'కావాలి అనుకోకుండా చేసే రోగం' (The malady of not wanting) అని అన్నాడు. అంటే, మంచిదనుకొన్న దాన్ని గట్టిగా కోరి వెంటాడాలి. ఆకలిదప్పులతో వెంటాడాలి. నీతినే ప్రధానంగా మనం కోరుకొంటూ ఉంటే ఈ లోకంలో ఎంతో ఎంచదగ్గ మార్పు వచ్చేది!

ఈ దృక్కోణంలో మనం ఈ ధన్యతను చూచినప్పుడు నీతిని మనలోనుండి మనం పొందాలనే వాంఛ బహు తీవ్రతరంగా ఉంటుంది. ఒకవిధంగా, బహు భయంకొలిపేదిగా కూడ ఉంటుంది. మరోవిధంగా బహు ఆదరణ కరంగా కూడ ఉంటుంది.

## 2

ఈ ధన్యతలోని మాటలను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే నీతిని సాధించిన మనిషి విషయంకాదుగాని కేవలం దానిని సాధించాలనే ప్రగాఢ చింత కలిగితేనే సరిపోతుందనిపిస్తుంది. ఆకలిదప్పులు కలిగి ఉండటమంటే, ఆ నీతిని సంపాదించాడని కాదు. సాధించాలనే పెనుగులాట. ఓడిపోతున్నా గెలవాలనే తాపత్రయముంటే సరి.  ఆ ధ్యేయాన్ని పట్టు వదలకుండా పిడికిటిని పట్టుకొని యుండుటయ0ని.

హెచ్.జి.వెల్స్ అనే ఆంగ్ల శాస్త్రీయ సంబంధ రచయిత, "ఒకడు పనికిమాలిన సంగీతకుడు కావచ్చును; కాని అతనికి సంగీతమంటే చెవికోసుకొనేంత ప్రేమ ఉండొచ్చు" అని అన్నాడు. అదే కోవలో రాబర్ట్‌లూయిస్ స్టీవెన్‌సన్ బహు అధ్వాన్నపు లోతులకు దిగజారిన వాడి విషయం ప్రస్తావిస్తూ, "సానెకొంపల్లో, ఉరికంబా న్నెక్కుతూ, తమలో మిగిలిపోయిన చిన్నమంత మంచితనాన్ని భద్రంగా పిడికిల్లో పట్టుకొంటూ" అని రాశాడు. సర్‌నార్మన్ బర్కెట్ అనే ప్రసిద్ధ న్యాయవాది, తరువాత న్యాయమూర్తి, తనపనిలో తటస్థపడ్డ నేరస్థులను గురించి మాటలాడుతూ, ప్రతిమానవునిలో ఆర్పివేయ లేని మంచితనాన్ని గురించి ప్రస్తావిస్తూ "తృప్తి తీరని వేటగాడు' తమ మడిమలబట్టి వెంటాడుతుంటాడు. మనుష్యుల్లో అత్యంత అధములు కూడ ఏదో ఒక దొడ్డతనానికే శిక్షింపబడ తార"ని తాత్వికంగా అన్నాడు.

ఒక మనిషిలో ఉండే మహాత్మ్యమేమంటే, అతడు పాపాత్ముడే కాని తన పాపంలో కూడ మంచితనం చేత వేధింపబడు తుంటాడు. బురదలో ఉండి కూడ ఆకాశ నక్షత్రాలను మరువలేని వాడు. దావీదు, తన జీవిత పర్యంతం  యెరూషలేము గుడిని కట్టాలని తపించాడు. ఆ అత్యాశనాతడు సాధించలేకపోయాడు. అసలది అతనికి కాకుండా చేయబడింది. అయితే, 'నా నామ ఘనతకు ఒక మందిరము కట్టించుటకు నీవు తాత్పర్యము కలిగియున్నావు, ఆ తాత్పర్యము మంచిదే' అని యెహోవా సెలవిచ్చి యున్నాడు (1రాజు.8:18). దేవుడు తన కృపా బాహుళ్యతను బట్టి మనల్ని తీర్పు తీరుస్తాడు. మనం సాధించి నెరవేర్చిన వానిని బట్టియేకాదు; మనం మనస్సుల్లో ఉద్దేశించి కనే కలలను బట్టికూడ ఒక మానవుడు ఒక మంచి నేనాటికీ సాధించలేకపాయినా తన అవసానకాలమందు దానికోసం ఆకలి దప్పులు కలిగియుంటే అతడు ధన్యుడు.

## 3

ఈ ధన్యతలో మరియొక విశేషం కూడ ఉంది. ఇది కూడ గ్రీకు మూలంలోని మాటలను పరిశీలిస్తే అర్థమోతుంది. గ్రీకు వ్యాకరణంలో ఆకలికొను (hunger ing), దప్పిగొను (thirsting) అనే present-par ticiple క్రియల తరువాత షష్టీ విభక్తి (Genitive case) వస్తుంది. అంటే 'of 'అని ఇంగ్లీషులో, 'యొక్క' అని తెలుగులో అనే పదాలు కలిసేవి. అంటే, hunger ing కు hunger ing of the man (మనిషియొక్క ఆకలిగొనుచుండుట). అంతేకాదు, ఒక కర్మార్థకమైందిగా కూడ ఉంటుంది.  అంటే, ఆ క్రియలోని అర్థంలోని మాటయే దానికి 'కర్మ' అవుతుంది. ఆకలిగొను చుండుట దేనికి? ఆహారం కొరకు. అంటే ఆహారం కోసం ఆకలిగొనటం అద్దైనా ఒక భాగమే. అంటే నిండుభోజనం కొరకు కూడ కాదు. పట్టెడన్నమయితే చాలు. అంటే ఆ అక్కర (ఆకలి, దప్పిక) తాత్కాలికంగా తీరే అంత. అంటే నీతికోసం అన్నప్పుడు ఏ కొంచెం నీతి కోసమైనా ఆకలిదప్పులుంటే... అని. అన రాదు. ఇక్కడ నీతి సంపూర్ణమైయింది. అసంపూర్ణమయింది ఆకలిదప్పులు.

కనుక,– "నీతి అంతటి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు" అనే భావం స్ఫురిస్తుంది.


అయితే, ఈ పరిపూర్ణతను ఏ కొందరో ఆశిస్తారు. అలాంటి వారు నీతిలోని ఏదో ఒక భాగంతోనే తృప్తిపడుతారు. ఒక మనిషిని ఇతరులు శల్య పరీక్ష చేస్తారు. అతనిలో ఏ కొంచెం అవకతవక లేకుంటేనే తనను మంచివాడని అంటారు. అతని యధార్థత, నైతిక సహజత్వం, గౌరవమర్యాదలు ప్రశ్నించుటకు వీలు లేనట్లుండాలి.

అటువంటి శుద్ధుని (మంచివాని) యొద్దకు ఎవరైనా పోయి తన బాధనాతని రొమ్ముమీద వదలి శిరమునానించి ఊరట పొందగలడో లేడో! అలా ఎవరైనా ప్రయత్నిస్తే ఆ మంచి మనిషి ముడుచుకపోవచ్చు. అంటే, మానవుల దృష్టిలో మంచివానిగా అనేక నైతిక స్వభావాలున్నవారు నిజానికి హృదయకాఠిన్యత కలిగిన వారై యుండవచ్చు. సానుభూతి శూన్యమైన వాడుకావచ్చు. అలాంటి మంచితనం అసంపూర్ణమైంది.

మరోదిశలో ఒకమనిషిలో బాహ్యమైన ఎన్నో అవకతవక లుండొచ్చు. అతడు త్రాగవచ్చు, బూతులాడవచ్చు. జూదరియై యుండవచ్చు, ముక్కుమీదనే కోపముండవచ్చు. అయినా, ఎవరైనా కష్టాల్లో అతన్ని సమీపిస్తే అతనిజేబులో ఉండే చివరి పైసా వరకు లోడి యివ్వవచ్చు. తనపై కోటు తీసి అక్కరలోనున్న వానికియ్యవచ్చు. అలాంటిదీ మంచితనంగా కనుపిస్తుంది కాని అదీ అసంపూర్ణమే.

అందుకని, నీతి అనేది మానవ అంచనాలతో సరిపెట్టుకొనేది కాదు. మనం ఆకలిదప్పులు కలిగి ఉండాల్సింది దేవుని నీతి విషయం. ఏ తప్పులేని మంచుగడ్డగా గాని, తప్పులన్నీ ఉండే వెచ్చదనంగా గాని ఉంటే చాలదు.

దేవుని నీతికోసం ఆకలిదప్పులుంటే ఆ నీతిని దేవుడు వారికి సమకూర్చి తృప్తిపరచును అని ఈ ధన్యత భావం. వారిని తృప్తి పరచేది శారీరక ఆకలిదప్పులు తీర్చటమని కాదు. నీతి విషయంలో కలిగిన ఆరాటాన్ని తీర్చి ఆత్మీయ తృప్తిని కలిగించటమని!



**వచ్చే మాసం:  కనికరం చూపటం - పొందటం**

## చందాదారుల వివరాలు

| | | |
|---|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. | 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 3,000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. | 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. | 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. | 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. | 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. | 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. | 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. | 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. | 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. | 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. | 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. | 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. | 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. | 500 |
| శ్రీమతి యు.మేరీసలోమి, సిరివెల్ల, కర్నూలు | రూ. | 500 |
| శ్రీ యం. శ్యాంబాబు, కైకలూరు, కృష్ణా జిల్లా | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది19-03-19) బ్యాంక్ అకౌంట్ | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పేరు తెలీదు (తేది31-03-19) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. | 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. | 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. | 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. | 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. | 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 250 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. | 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. | 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. | 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. | 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. | 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. | 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. | 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. | 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. | 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. | 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. | 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. | 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. | 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. | 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ టి. మరియబాబు, గొట్టిపాడు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. | 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతిపురం,విజయనగరం జిల్లా | రూ. | 200 |

శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా రూ. 200
శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా రూ. 200
పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ రూ. 200
శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు రూ. 200
శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ రూ. 200
శ్రీ టి. నాగార్జున, కరీంనగర్ రూ. 200
శ్రీ కె. బెంజిమెన్, విజయవాడ, కృష్ణా జిల్లా రూ. 200
శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ రూ. 150
పాస్టర్ జె. జయరాములు, కాకినాడ రూ. 150
పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా రూ. 150
శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం రూ. 150
శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ రూ. 150
పాస్టర్ వి.ఎ.యస్.ప్రసాద్, జడ్చర్ల రూ. 150
పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట రూ. 150
శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా రూ. 150
పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా రూ. 150
పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా రూ. 150
శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా రూ. 150

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము**

**బైబిల్ క్విజ్ - 51 ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**


1) **శ్రీమతి జె.డి.సుహాసిని,** రాజమండ్రి, తూ.గో. జిల్లా
2) **శ్రీ సి.హెచ్. జ్ఞానేష్,** అచంట, ప.గో జిల్లా
3) **పాస్టర్ జె.జయరాములు,** కాకినాడ, తూ.గో.జిల్లా
4) **శ్రీమతి కె.లలితాభాగ్యం,** కనిగిరి, ప్రకాశం జిల్లా
5) **శ్రీమతి.యస్‌డి. మాలిని,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
6) **శ్రీమతి కె. సుభద్ర,** విజయవాడ
7) **కత్తి ఝాన్సీ,** విజయవాడ

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# ఈ నెల ప్రశ్న -నవంబర్-2019

**వేటికి తేజోహీనత కలుగుచున్నది?**
(యోవేలు) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 125/-లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**అక్టోబర్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**
జవాబు : యూదావారు (హోషేయ 11:12)

1) శ్రీమతి కె. లలితాభాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా
2) శ్రీమతి.యస్‌డి. మాలిని, ఒంగోలు ప్రకాశం జిల్లా
3) శ్రీమతి జె.డి.సుహాసిని, రాజమండ్రి
4) పాస్టర్ జె.జయరాములు, కాకినాడ, తూ.గో.జిల్లా
5) శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ

# బైబిల్ క్విజ్ - 51 జవాబులు

**1.** హగ్గయి 1:13 **2.** జెరుబ్బాబెలు (2:23) **3.** శెబాటు (జెకర్యా1:7) **4.** 2:13 **5.** ఏడు (3:9) **6.** జెరుబ్బాబెలు (4:6-7) **7.** 20మూరలు (5:2) **8.** జెఫన్యా(6:10) **9.** కరుణావాత్సల్యములు (7:9) **10.** తన పొరుగు వానితో (8:16) **11.** అష్డోదులో (9:6) **12.** ఐగుప్తీయులు (10:11) **13.** పనికిమాలిన(11:17) **14.** యూదా వారిని(12:7) **15.** 13:9 **16.** ఉజ్జియా(14:5) **17.** మలాకీ 1:14 **18.** యాజకులు (2:7) **19.** యెహోవాయందు భయభక్తులు గలవారు (3:16) **20.** హోరేబు (4:4)



# అక్షరయజ్ఞం

## బైబిల్ క్విజ్ - 52
(మత్తయి సువార్త )



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ఇమ్మానుయేలు అనగా అర్థమేమి? (మత్తయి 1అ)
2. రామాలో అంగలార్పు వినబడెను అని చెప్పిన ప్రవక్త ఎవరు? (2అ)
3. “ఈయనే నాప్రియ కుమారుడు ఈయనయందు నేనానందించుచున్నాను” రిఫెరెన్స్ ఏమిటి? (3అ)
4. పేతురు సహోదరుని పేరేమిటి? (4అ)
5. మీ ----- ప్రేమించుడి పూరించుము. (5అ)
6. ఆయన రాజ్యముతో పాటు మొదట వెదకవలసినది ఏమిటి? (6అ)
7. బండమీద ఇల్లు కట్టుకొనిన వాడు ఎవరిని పోలియుండును ? (7అ)
8. ఆయనే మన బలహీనతలు వహించుకొని మన రోగములను భరించెను అని ఎవరి ద్వారా చెప్పబడినది? (8అ)
9. కోత విస్తారమేగాని కొద్దిగా ఉన్నది ఎవరు? (9అ)
10. వేటివలె నిష్కపటులై ఉండాలి? (10అ)
11. ---- ఆకాశము మట్టుకు హెచ్చింపబడెదవా? పూరించుము(11అ)
12. నా పక్షమున ఉండనివాడు నాకు --- పూరించుము(12అ)
13. కోతకోయువారు ఎవరు? (13అ)
14. రాత్రి ఎన్నవ జామున ఆయన సముద్రము మీద నడుచుచు వారియొద్దకు వచ్చెను? (14అ)
15. మిగిలిన ముక్కలు ఎన్ని గంపల నిండా ఎత్తిరి? (15అ)
16. “నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు” అని చెప్పినది ఎవరు? (16అ)
17. ఎవరు స్వతంత్రులు? (17అ)
18. అభ్యంతరముల వలన ఎవరికి శ్రమ? (18అ)
19. కడపటివారు---- అగుదురు పూరించుము? (19అ)
20. మనుష్య కుమారుడు ఎవరికి అప్పగింపబడును? (20అ)

**గమనిక**

మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **“బైబిల్ క్విజ్-52”** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి “నా దూత” (బాప్తిస్మమిచ్చు యోహాను కథ) అను పుస్తకము (వెల రూ. 50/-) లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**గమనిక**

ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించ వచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.